ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

గుంటూరు జిల్లా వార్తలు

5

ఆదివారం 19 అక్టోబరు 2025

పరిశుభ్రమైన వాతావరణానికి కృషి

● హరిత జిల్లాకు ప్రజలు భాగస్వామ్యం కావాలి

● స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర ర్యాలీలో కలెక్టర్ అన్సారియా

గుంటూరు, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు పరిశుభ్రమైన వాతావరణం అందించేందుకు నగర పాలక సంస్థ కృషి చేయాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా తెలిపారు. స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా మూడో శనివారం నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో క్లీన్ ఎయిర్ అంశంపై ర్యాలీ జరిగింది. స్థానిక జిల్లా కోర్టు కాంపౌండ్ వద్ద ర్యాలీని కలెక్టర్ ప్రారంభించగా కార్పొరేషన్ వరకు సాగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాను క్లీన్, గ్రీన్‌గా తీర్చిదిద్దేందుకు ప్రజలందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. వాయు కాలుష్యాన్ని తగ్గించడానికి ప్రజలు ప్రజారవాణాని వినియోగించాలన్నారు. కనీసం వారంలో ఒక్కరోజు అయినా మోటరు వాహనాలకు బదులు సైకిళ్లు వినియోగించాలని ప్రజలకు సూచించారు. మేయరు కోవెలమూడి రవీంద్ర మాట్లాడుతూ ప్రజల్లో అవగాహన కల్పించడం ద్వారా రాష్ట్ర స్థాయిలో గుంటూరును స్వచ్ఛ నగరంగా నిలిపేందుకు కృషి చేస్తున్నామన్నారు. పశ్చిమ ఎమ్మెల్యే గళ్లా మాధవి మాట్లాడుతూ పర్యావరణ కాలుష్యం తగ్గించడానికి విడివిడిగా మొక్కలు నాటాలన్నారు. పచ్చదనం పెంపొందించి స్వచ్ఛ గుంటూరు, గ్రీన్ గుంటూరు కోసం ప్రజాభాగస్వామ్యంతో కృషి చేస్తామని తెలిపారు. కమిషనరు పులి శ్రీనివాసులు మాట్లాడుతూ నగరంలో వాయు కాలుష్యం తగ్గించి, స్వచ్ఛమైన గాలిని అందించేందుకు 5 లక్షలు మొక్కలు నాటడానికి చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో హజ్ కమిటీ చైర్మన్ హసన్‌బాషా, డీఆర్వో ఎస్ఎస్‌కే ఖాజావలి, డీఆర్డీఏ పీడీ విజయలక్ష్మి, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ కల్యాణచక్రవర్తి, డీటీసీ సీతారామిరెడ్డి, డిప్యూటీ డీఎంహెచ్‌వో సువర్ణబాబు, నగరపాలక సంస్థ డిప్యూటీ మేయర్ షేక్ సజీల, ఏసీ చల్లా ఓబులేసు, డీసీలు శ్రీనివాసు, వెంకటకృష్ణయ్య, ఆర్డీవో శ్రీనివాసరావు, తహసీల్దారు వెంకటేశ్వర్లు, అధికారులు, వివిధ డివిజన్ల కార్పొరేటర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.



స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర ర్యాలీలో పాల్గొన్న కలెక్టర్ తమీమ్ అన్సారియా, ఎమ్మెల్యే మాధవి, మేయర్ కోవెలమూడి రవీంద్ర, కమిషనర్ పులి శ్రీనివాసులు తదితరులు


అమరేశ్వరస్వామి మూలవిరాట్

22 నుంచి కార్తీకమాస పూజలు

అమరావతి, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 22 నుంచి కార్తీకమాసం ప్రారంభం అవుతున్నందున పంచారామ క్షేత్రాలలో ప్రథమ ఆరామంగా పేరుగాంచిన బాలచాముండికా సమేత అమరేశ్వరాలయంలో నెల రోజుల పాటు ప్రత్యేక పూజలు నిర్వహిస్తామని ఈవో రేఖ తెలిపారు. ఆలయంలో స్వామివారికి ప్రత్యక్ష, పరోక్ష అభిషేకాలు, కుంకుమ పూజలు, మహాన్యాస రుద్రాభిషేకాలు, లక్షబిల్వార్చన పూజలు తదితర కార్యక్రమాలు జరుగుతాయన్నారు. పౌర్ణమి రోజున సాయంత్రం గ్రామోత్సవం, కృష్ణానదికి హారతులు, తెప్పోత్సవం, జ్వాలాతోరణం తదితర కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. భక్తుల రద్దీకి అనుగుణంగా ఆలయంలో క్యూలు, స్నానఘాట్ల వద్ద ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ఆది, సోమవారాలలో ఉదయం 4 నుంచి రాత్రి 10 వరకు, మిగిలిన రోజుల్లో రాత్రి 9 గంటల భక్తులకు ఆలయ ప్రవేశం ఉంటుందని తెలిపారు.

పత్తి.. పతనం

తెల్ల బంగారం.. సాగు చేసిన వారు మాత్రం తెల్లబోతున్నారు. పత్తిసాగు ఆరంభంలో వర్షాభావం.. ఆ తర్వాత అధిక వర్షాలు.. ఆపై తెగుళ్లతో పెట్టుబడులు పెరిగిపోయాయి. నీటి కష్టాలతో అధిగమించి.. తెగుళ్లను తప్పించుకుని.. పత్తి సాగు చేపట్టారు. వీడని వర్షాలు.. తెగుళ్లతో దిగుబడులు తగ్గిపోగా.. ధరలు అమాంతం పతనమయ్యాయి. ఒకవైపు భయపెడుతున్న వర్షాలు.. మరోవైపు నిల్వ సమస్యలతో రైతులు తీసిన పత్తిని తీసినట్లుగా అమ్ముకోవడంపై ఆసక్తి చూపుతున్నారు. ఇదే సమయంలో సీసీఐ కొనుగోళ్ల కేంద్రాల ప్రారంభానికి మరికొన్ని రోజులు గడువు ఉంది. ఇదే అవకాశంగా రైతుల నుంచి తక్కువ ధరకు వ్యాపారులు పత్తిని కొనుగోలు చేస్తున్నారు. ఆశించనట్లుగా దిగుబడి లేక.. పెట్టిన పెట్టుబడి రాకపోవడంతో పత్తి రైతులు కన్నీటి పర్యంతమవుతున్నారు.



దిగుబడి, ధర తగ్గుదల

తెగనమ్ముకుంటున్న సాగుదారులు

క్వింటాల్ రూ.4500 నుంచి రూ.5200 మాత్రమే

(గుంటూరు సిటీ, ఆంధ్రజ్యోతి)

గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల పరిధిలో తెల్ల బంగారం తెల్లబోతుంది. సీజన్ ఆరంభంలోనే వ్యాపారులు పత్తి ధరను పాతాళంలో పడేశారు. ఏదో ఒక సాకు చెప్పి క్వింటాల్ పత్తిని రూ.4500 నుంచి రూ.5200 మాత్రమే కొనుగోలు చేస్తున్నారు. ఖరీఫ్ లో మొదటి పంటగా భావించే పత్తి ధర ఆరంభంలోనే అతితక్కువ స్థాయికి పడిపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలో అధికంగా సాగయ్యే పంటల్లో పత్తి ఒకటి. ఈ ఏడాది గుంటూరు జిల్లాలో 59,140 ఎకరాల్లో, పల్నాడు జిల్లాలో 2,27,180 ఎకరాల్లో, బాపట్ల జిల్లాలో 4,585 ఎకరాల్లో పత్తిని సాగు చేశారు. ఏటా సీసీఐ కొనుగోళ్ల ఆరంభం కావడం వల్ల పెద్దగా నష్టం (మిగతా 6లో)

పెట్టుబడి రూ.60 వేలు.. దిగుబడి అంతంతే

రైతులు పత్తి సాగు కోసం ఎకరాకు రూ.60 వేలు తగ్గకుండా పెట్టుబడి పెట్టారు. తొలకరి ఆరంభంలో కురిసిన వర్షాలకు మొక్కలు వేయగా, అప్పట్లో ఒక వారం, పది రోజులు తర్వాత కనుమరుగయ్యాయి. దీంతో చాలా పొలాల్లో మొక్కలు ఎక్కువగా చచ్చిపోయాయి. ఎర్ర తెగులు నివారణకు అధికంగా పురుగు మందులు వాడారు. దాంతో పెట్టుబడి రెండింతలైంది. ఇంత చేసినా ఎకరాకు 6 నుంచి 9 క్వింటాల్ మాత్రమే దిగుబడి వచ్చే పరిస్థితితో సాగుదారులు కన్నీటి పర్యంత మవుతున్నారు.

విస్తారంగా వర్షాలు.. ఎర్ర తెగులు

ఈ ఏడాది వర్షపాతం అధికంగా నమోదైంది. గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల్లో పత్తి సాగు మొదలు పెట్టిన తర్వాత వర్షం ఎక్కువగా కురిసింది. దీంతో పంటను ఎర్ర తెగులు ఆశించింది. తెగులు నివారణకు రైతులు పలు రకాల మందులు పిచికారి చేసినా ప్రయోజనం లేకుండా పోయింది. చాలా చోట్ల వర్షం నీళ్లు ఎక్కువ రోజులు నిల్వ ఉండటం వల్ల చేలు పూర్తిగా ఉరకెత్తాయి. ఇది రైతులకు తీవ్రంగా నష్టం చేకూర్చింది.

వర్షంతో.. టెన్షన్

● బాణసంచా వ్యాపారుల్లో గుబులు ● అల్పపీడన ప్రభావంతో వర్షాలపై ఆందోళన



గుంటగ్రౌండ్‌లో ప్లాస్టిక్ పట్టలు కప్పుకుంటున్న దుకాణదారులు

గుంటూరు, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): చిన్నా పెద్ద తారతమ్యం లేకుండా ఉత్సాహంగా జరుపుకునే టపాకాయల పండుగ సోమవారమే. వెలుగులు జిలుగులతో నిండే పండుగకు అటు వ్యాపారులు సిద్ధమయ్యారు. అయితే రెండు రోజులుగా ఆకాశం మేఘావృతమై.. శనివారం సాయంత్రం ఓ మోస్తరు వర్షం కూడా పడింది. దీంతో రూ.లక్షలు వెచ్చించి మందుగుండు సామగ్రి విక్రయాలకు తెచ్చి దుకాణాల్లో నిల్వ చేసుకున్న వ్యాపారుల్లో టెన్షన్ నెలకొంది. అల్పపీడన ప్రభావంతో వాతావరణ మార్పులతో బాణసంచా వ్యాపారులు ఆందోళన చెందుతున్నారు. చిన్నారుల నుంచి పెద్దల వరకు అందరూ సంతోషాలతో జరుపుకునే దీపావళి పండుగకు ఈ ఏడాది జిల్లాలో బాణాసంచా దుకాణాలు పెద్ద ఎత్తున వెలిశాయి. పండుగ రోజున బాణసంచా కాల్చేందుకు ఇంటిల్లిపాది ఆసక్తి చూపుతారు. అయితే అల్పపీడన ద్రోణి కారణంగా భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్న ప్రకటన ఇప్పుడు అందరిలో టెన్షన్ కలిగిస్తోంది. జిల్లాలో గుంటూరుతో పాటు మంగళగిరి తదితర ప్రాంతాల్లో హోల్‌సేల్ దుకాణాల్లో ఇప్పటికే పెద్దఎత్తున అమ్మకాలు జరిగాయి. ఇక తాత్కాలికంగా అనుమతులు తీసుకుని ఎక్కడి కక్కడ బాణసంచా విక్రయించేందుకు వ్యాపారులు స్టాల్స్ ఏర్పాటు చేశారు. గుంటూరులోని గుంట గ్రౌండ్స్‌తో పాటు ఏసీ కళాశాల ఆవరణ, వెంకటేశ్వర విజ్ఞాన మందిరం, రింగ్‌రోడ్డు తదితర ప్రాంతాల్లో తాత్కాలిక దుకాణాలు ఏర్పాటు చేశారు.



టపాకాయల కొనుగోలులో వినియోగదారులు

అమ్మకాలపైనే ఆందోళన...

ఈ దఫా దీపావళి సోమవారం రావడంతో ఆది, సోమవారాలు శెలవుదినాలు వచ్చాయి. దాంతో పండుగకు రెండు రోజుల పాటు అమ్మకాలు బాగానే జరుగుతాయని వ్యాపారులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. అయితే వాతావరణ ప్రభావంతో అమ్మకాలపై ఎలాంటి ప్రభావం చూపుతుందోనన్న ఆందోళన వ్యాపారుల్లో నెలకొన్నది.

నింగిలోకి కేఎల్‌యూ శాటిలైట్లు

● విద్యార్థుల కృషి అమోఘమన్న మంత్రి శ్రీనివాసవర్మ, రఘురామ కృష్ణరాజు, కోనేరు నిఖిల


కెఎల్ శాట్ 2ను ప్రారంభిస్తున్న కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ, కేఎల్‌యూ వైస్‌చైర్మన్ కోనేరు నిఖిల

సైకిలెక్కిన వైసీపీ ఎంపీటీసీలు

● టీడీపీ కండువా కప్పి ఆహ్వానించిన ఎమ్మెల్యే నరేంద్ర ● గత ప్రభుత్వంలో అభివృద్ధే జరగలేదన్న ఎంపీటీసీలు

పెదకాకాని, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని వైసీపీకి చెందిన పలువురు ఎంపీటీసీలు శనివారం సైకిలెక్కారు. పెదకాకాని ఎంపీటీసీలు షేక్ గుల్జార్‌బేగం, మాతంగి నిర్మల, అగతవరప్పాడు ఎంపీటీసీ కుంచాల కోటిరెడ్డి టీడీపీలో చేరారు. వీరికి ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్ టీడీపీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎంపీటీసీలు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత పొన్నూరు నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలను చూసి ఆకర్షితులమయ్యామన్నారు. గత ప్రభుత్వంలో తాము ఎన్నికైనప్పటికీ ఎలాంటి అభివృద్ధి జరగలేదన్నారు. ఎన్నుకున్న ప్రజలకు ఎలాంటి న్యాయం చేయలేకపోయామని తెలిపారు. ప్రజలకు న్యాయం చేయాలంటే సరైన నాయకత్వం కింద నడవాలని, తమ ప్రాంతాన్ని అభివృద్ధి చేసుకోవాలని టీడీపీలో చేరినట్లు ఎంపీటీసీలు తెలిపారు.


ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర సమక్షంలో టీడీపీలో చేరిన వైసీపీ ఎంపీటీసీలు

సంస్కృతాంధ్ర పండితుడు జన్నాభట్ల మృతి

కాటికాపరి దారుణ హత్య

22న మెగా జాబ్ మేళా

కాల్వలో దూకి వృద్ధురాలు ఆత్మహత్య

ప్రకాశం బ్యారేజి.. దిగువకు 36,250 క్యూసెక్కులు

● డెల్టా కాల్వలకు 15,031 క్యూసెక్కులు

6

దీపం-2 మూడో విడత రాయితీ ఎప్పుడో!

8

వ్యత్యాసం ఎందుకు?

● ఖమ్మం నుంచి బిహార్ వెళ్లే మిర్చి లారీలు ఇక్కడివే

● అలాంటప్పుడు కిరాయిలో రూ.30 వేల వ్యత్యాసం ఎందుకు?

వామ్మో.. ప్రత్యేక రైళ్లు



● భయపడుతున్న ప్రయాణికులు

● ఈ రైళ్లలో ఆదరణ, భద్రత రెండూ తక్కువే

● షెడ్యూల్ సమయానికి ప్రయాణించని వైనం

● గంటల తరబడి జాప్యంతో ప్రయాణికులకు నరకం

గుంటూరు, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): రద్దీ రోజుల్లో ఒకప్పుడు ప్రత్యేక రైళ్లను రైల్వే శాఖ ఎప్పుడు ప్రకటిస్తుందా అని ప్రయాణికులు ఎదురు చూసే వాళ్లు. ఎప్పుడు వస్తాయో.. ఎప్పుడు గమ్యస్థానానికి చేరుతాయో తెలియక.. కనీస సౌకర్యా లను పట్టించుకునే వారు లేక.. నేడు స్పెషల్ ట్రైన్స్ అంటేనే భయపడి పోతున్నారు. సమయపాలన అనేది ఈ రైళ్లకు కనీసం 10 శాతం కూడా ఉండదు. ఈ కారణంగా స్లీపర్ క్లాస్/ఏసీ తరగతుల్లో అరకొరగానే ప్రయాణికులు టిక్కెట్లు రిజర్వు చేసుకుంటున్నారు. స్పెషల్ ట్రైన్స్ గురించి తగిన సమాచారం ఉండకపోవడంతో జనరల్ బోగీల్లో ఎవరూ పెద్దగా ప్రయాణించడం లేదు. దీంతో ప్రయాణికుల్లో ముఖ్యంగా మహిళల భద్రతకు గ్యారెంటీ లేకుండా పోతోంది. రైల్వే నిబంధనల ప్రకారం ఏదైనా మార్గంలో లైన్ కెపాసిటీ 100 శాతం మించ కూడదు. అయితే గుంటూరు రైల్వే డివిజన్‌లోని నంద్యాల, నడికుడి మార్గాల్లో ఇంతకు మించి రైళ్లు/గూడ్స్‌లు ప్రయాణిస్తున్నాయి. దీనికి కారణం ప్రత్యేక రైళ్లను నడుపుతుండటమే. ఏదైనా స్పెషల్ ట్రైన్ ప్రకటించేటప్పుడు పాత్ చూసుకోవాలి. ఏ సమయానికి ఆ రైలు ఏ స్టేషన్‌కు వెళ్లాలి అనేదే పాత్. ఆ ప్రకారమే నడిపితే ఎలాంటి ఇబ్బంది ఉండదు. అయితే పాత్ నిబంధన పాటించకుండా రైళ్లను నడుపు తున్నారు. దీంతో సింగిల్ లేన్ రూట్‌లో అయితే క్రాసింగ్/ప్రిసిడెన్స్ కోసం స్పెషల్స్‌ని లూప్‌లైన్‌లో పెడతారు. డబుల్ లేన్ మార్గాల్లో రెగ్యులర్ రైళ్లకు ప్రిసిడెన్స్ ఇచ్చి స్పెషల్ ట్రైన్‌ని లూప్‌లో పెట్టి పంపుతారు. ఈ కారణంగా గంటల తరబడి ప్రత్యేక రైళ్లు ఆలస్యమౌతాయి. ఈశాన్య రాష్ట్రాల నుంచి వచ్చే రైళ్లు అయితే కొన్ని సందర్భాల్లో 12 గంటలకు పైగా ఆలస్యమౌతున్న దాఖలాలు ఉన్నాయి.

చార్జీ అధికమైన ప్రాధాన్యం తక్కువ

ఈ స్పెషల్ రైళ్లలో చార్జీలు కూడా ఎక్కువే. తత్కాల్ టిక్కెట్ చార్జీకి సమానంగా ధర ఉంటుంది. అయినా రాకపోకల్లో రెగ్యులర్ రైళ్లకు ఇచ్చినంత ప్రాధాన్యం వీటికి ఇవ్వడంలేదు. ఎప్పుడు వస్తాయో.. ఎప్పుడు కదులుతాయో కూడా తెలియక ప్రయాణికులు తీవ్రంగా ఇబ్బందులు పడుతుంటారు. కొన్ని రైళ్లలో అయితే ఫ్యాన్లు తిరగవు.. మరుగుదొడ్లలో నీళ్లు కూడా ఉండవు. అరకొర సౌకర్యాల మధ్య ప్రయాణికులు గోడు ఎవరూ పట్టించు కోరు. అయినా తప్పనిసరి పరిస్థితుల్లో, అత్యవసరమైన వాళ్లు మాత్రమే మరో ప్రత్యామ్నాయం లేక వీటిల్లో టిక్కెట్లు బుకింగ్ చేసుకుంటారు. ఏ ప్రత్యేక రైలులోనైనా జనరల్ బోగీలు ఖాళీగా ఉంటాయి. వీటి గురించి సమాచారం లేకపోవ డం, ఆలస్యంగా ప్రయాణిస్తుండటం ప్రధాన కారణాలు. ఇదే అదనుగా మహిళలు/సీనియర్ సిటిజన్స్ బోగీలో పురుషులు ఎక్కేస్తున్నారు. దీనిని అడ్డుకోవాల్సిన ఆర్‌పీఎఫ్, సెక్యూరిటీ విభాగం సిబ్బంది పట్టించుకోవడం లేదు. ఏదైనా సంఘటన జరిగిన తర్వాత కొన్ని రోజులు హడావిడి చేయడం ఆ తర్వాత పట్టించుకోకపోవడం చేస్తున్నారు. ఈ నెల 13న సంత్రగచి స్పెషల్ మహిళల బోగీలో పురుషుడు చివరి నిమిషంలో ఎక్కుతుండటాన్ని గార్డు గమనించారని రైల్వే అధికారులు చెబుతున్నారు. అలాంటప్పుడు గార్డు వైర్‌లెస్ సెట్‌లో లోకోపైలట్‌కు చెప్పి రైలుని ఆపి తగిన చర్యలు తీసుకోవాలి. అలా చేయకుండా ఆ ప్రయాణికుడు కింద పడి పోతాడని రైలుని ఆపలేదని చెబుతుండటం ఎంతవరకు సమంజసమో అధికారులు చెప్పాలి. చిన్న తప్పిదం వల్ల ఒక ప్రయాణికురాలు అత్యాచారం, దోపిడీకి గురయ్యారు. దీనికి ఎవరిని బాధ్యులను చేస్తారో చూడాలి.

ఏలూరు గంజాయి.. పల్నాడులో ధ్వంసం


జిందాల్ ప్లాంట్‌లో ఏలూరు పోలీసు అధికారులు

యడ్లపాడు, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): ఏలూరు జిల్లాలోని 22 పోలీస్‌స్టేషన్‌ల పరిధిలో నమోదైన 59 కేసుల్లో పట్టుబడిన గంజాయిని పోలీసులు శనివారం ధ్వంసం చేశారు. మండలంలోని కొండవీడు రెవెన్యూ పరిధిలో గల జిందాల్ వేస్ట్ మేనేజ్‌మెంట్ ప్లాంటులో జరిగిన ఈ కార్యక్రమాన్ని ఏలూరు జిల్లా ఎస్పీ కె.ప్రతాప్ కిషోర్ ఆధ్వర్యంలో జరిగింది. ఎస్పీ మాట్లాడుతూ జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో జరిపిన దాడుల్లో సుమారు 3,403 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకోవడం జరిగిందన్నారు. ఈ గంజాయిని జిందాల్ వేస్ట్ మేనేజ్‌మెంట్ ప్లాంట్‌లో పర్యావరణ అనుకూల పద్ధతిలో ధ్వంసం చేయడం జరిగిందన్నారు. ఏలూరు అదనపు ఎస్పీ సూర్యచంద్రరావు, ఎస్‌డీపీవో రవిచంద్ర, డీసీఆర్‌బీ సీఐ మహమ్మద్ హబీబ్‌భాషా, ఏలూరు ఒకటవ టౌన్ సీఐ సత్యన్నారాయణ ఇతర పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డుప్రమాదంలో వ్యక్తి మృతి

బాపట్ల రూరల్, అక్టోబరు18 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన ఘటన శనివారం చోటు చేసుకుంది. వెదుళ్ళపల్లి ఎస్ఐ భాగ్యరాజ్ వివరాల మేరకు.. బాపట్ల పట్టణం చిల్లర గొల్లపాలేనికి చెందిన కొమ్మినేని శ్రీనివాసరావు (50) ద్విచక్ర వాహనంపై బాపట్ల నుంచి చీరాల వెళ్తున్నాడు. స్టూవర్టుపురం జాతీయ రహదారిపై వెనుక నుంచి లారీ అతని ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. దీంతో శ్రీనివాసరావు అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బాపట్ల ఏరియా వైద్యశాలకు తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐతెలిపారు.

సంస్కృతాంధ్ర పండితుడు జన్నాభట్ల మృతి


జన్నాభట్ల లక్ష్మీనారాయణ

నరసరావుపేట కల్చరల్, అక్టోబర్18 (ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన సంస్కృతాంధ్ర పండితుడు, పౌరాణిక నటుడు, అవధాని జన్నాభట్ల లక్ష్మీనారాయణ(65) శుక్రవారం రాత్రి రోడ్డు ప్రమాదానికి గురై అకాల మరణం చెందారు. పనిమీద వినుకొండ వెళ్లి ద్విచక్ర వాహనంపై నరసరావుపేటకు తిరిగి వస్తుండగా మండలంలోని పెట్లూరివారిపాలెం వద్ద రోడ్డు ప్రమాదానికి గురయ్యారు. అత్యవసర చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించగా రాత్రి ఆయన మృతి చెందారు. జన్నాభట్ల పట్టణంలోని వివిధ విద్యా సంస్థలో సంస్కృతాంధ్ర పండితుడిగా పనిచేశారు. పౌరాణిక నటుడిగా రంగస్థలంపై ఎన్నో పాత్రలు పోషించి ప్రేక్షకులను మెప్పించారు. ఎన్నో అవధాన ప్రక్రియల్లో పాల్గొని తన ప్రతిభ చూపారు. ఉమ్మడి గుంటూరు జిల్లా రంగస్థల కళాకారుల ఐక్య వేదిక సెక్రటరీగా పనిచేసి ఎంతోమంది పేద కళాకారులకు ప్రభుత్వం ద్వారా పెన్షన్ మంజూరు చేయించారు. ఆంధ్రప్రదేశ్ సాంస్కృతిక శాఖ ద్వారా ఎన్నో కార్యక్రమాలు నిర్వహించారు. ఆధ్యాపక వృత్తి నుంచి విరమణ పొందాక ఆయన పౌరోహిత్యం చేస్తున్నారు. జన్నాభట్ల మృతి పట్ల నరసరావుపేట కళా వేదిక వ్యవస్థాపకులు పొన్నపాటి ఈశ్వరరెడ్డి, నరసరావుపేట రంగస్థలి అధ్యక్షుడు మహబూబ్ సుభాని, మాజీ అధ్యక్షుడు కిలారు వెంకట్రావు, శ్రీనాథ సాహితీ పరిషత్ కార్యదర్శి స్వర్ణ రామిరెడ్డి, భువనచంద్ర టౌన్ హాల్ కమిటీ చైర్మన్ జవ్వాజి వెంకట్రావు, కన్వీనర్ సర్దార్ పాషా, కపలవాయి విజయ్‌కుమార్, షేక్ బాజీ మస్తాన్, నల్లపాటి బోస్, మార్కెట్ మస్తాన్ వలి, ఎ.ఎ.మధుకుమార్ పలువురు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.60 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	130, 139, 150
చికెన్ విత్ స్కిన్(కిలో)	248.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	258.00

నింగిలోకి కేఎల్‌యూ శాటిలైట్లు

● విద్యార్థుల కృషి అమోఘమన్న మంత్రి శ్రీనివాసవర్మ, రఘురామ కృష్ణంరాజు, కోనేరు నిఖిల


సమావేశంలో మాట్లాడుతున్న కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ

తాడేపల్లి, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): వడ్డేశ్వరంలోని కేఎల్ డీమ్డ్ యూనివర్సిటీ విద్యార్థులు అధ్యాపకులతో కలిసి రూపొందించిన మూడు శాటిలైట్‌లను విజయవంతంగా నింగిలోకి పంపారు. వర్సిటీ తలపెట్టిన కేఎల్ జాక్ నింగిలోకి వెళ్లి పరిశోధన ప్రారంభించింది. శనివారం ఉదయం 5.45 లకు కాన్ శాట్, కేఎల్ జాక్ శాటిలైట్‌ను పీకో బెలూన్ సాయంతో కేంద్ర సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ, డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణంరాజు, కేఎల్‌యూ వైస్ చైర్మన్ కోనేరు నిఖిల, వీసీ సారథివర్మ, జాక్ శాటిలైట్ రూపకర్త కేసీహెచ్ శ్రీకావ్య విద్యార్థులతో కలిసి నింగిలోకి వదిలారు. ఏటీపీ గన్నవరం ఎయిర్ ట్రాఫిక్ క్లియరెన్స్ వచ్చాక 6.45 గంటలకు కేఎల్ శాట్ 2ను బెంగళూరుకు చెందిన రెడ్ వింగ్ సంస్థ సహకారం, ఫ్లయిట్ మోడ్ డ్రోన్ సాయంతో నింగిలోకి పంపారు. నిర్దేశిత కక్ష్యలోకి వెళ్లిన తర్వాత కేఎల్‌యూ విద్యార్థులు ఇచ్చిన ఆదేశాలకు అనుగుణంగా శాటిలైట్.. గంటపాటు భూమి నుంచి సుమారు 12 కిలోమీటర్ల ఎత్తులో 60 కిలోమీటర్లు సమాంతరంగా ప్రయాణించి పరిశోధనలు చేసి.. మళ్లీ లాంచ్ పాడ్‌పై విజయవంతంగా దిగింది. కేఎల్ జాక్ శాటిలైట్ గాలి నాణ్యతను, కేఎల్ శాట్-2 వాతావరణ పరిస్థితులసౌ అధ్యయనం చేయనుంది. దీంతో 3-కాన్ శాట్‌ల ప్రయోగం విజయవంతమైంది. నింగిలోకి వెళ్లిన కాన్ శాట్ సుమారు 20 నిమిషాల పాటు ఆకాశంలోనే విహరిస్తూ కంట్రోల్ సెంటర్‌కు ఎప్పటికప్పుడు డేటాను పంపుతూ సుమారు 20 నిమిషాల తర్వాత లాంచ్‌పాడ్ వద్ద దిగింది. కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ మాట్లాడుతూ ప్రతికళాశాల ఒక ప్రయోగశాలగా మారాల్సిన అవసరం ఉందన్నారు. 2047 నాటికి మేక్ ఇన్ ఇండియా, ఆత్మ నిర్భర్ పేరుతో ప్రధాని మోదీ స్వదేశీ పరిజ్ఞానాన్ని అభివృద్ధి చేయడానికి కృషి చేస్తున్నారన్నారు. డిప్యూటీ స్పీకర్ కె.రఘురామ కృష్ణంరాజు ఉప గ్రహానికి రూపకల్పన చేసిన బృంద సభ్యులను, అధ్యాపకులను అభినందించారు. కేఎల్‌యూ వైస్ చైర్మన్ కోనేరు నిఖిలా కార్తికేయన్ మాట్లాడుతూ రాకెట్ ప్రయోగ దిశగా అడుగులు వేస్తామని, విద్యార్థుల కృషి అమోఘమన్నారు. ఈ కార్యక్రమంలో బృంద సభ్యులు ప్రోవీసీలు డాక్టర్ ప్రసాద్, వెంకట్రామ్, రాజశేఖరరావు, రిజిస్ట్రార్ సుబ్బారావు, ఆర్అండ్ డీన్ డాక్టర్ బీటీపీ మాధవ్, డీన్‌లు, డైరెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

నాగోతు చిన్నమ్మకు ఘన నివాళి


నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ


నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యేలు ప్రత్తిపాటి, చదలవాడ

నకరికల్లు, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ నాగోతు శౌరయ్య మాతృమూర్తి నాగోతు చిన్నమ్మ దశ దిన కర్మ తురకపాలెంలో శనివారం నిర్వహించారు. నాగోతు చిన్నమ్మకు శ్రద్ధాంజలి ఘటించి టీడీపీ నాయకులు నివాళులర్పించారు. నాగోతు శౌరయ్యను, కుటుంబ సభ్యులను పరామర్శించి సంతాపం, ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ, నరసరావుపేట, చిలకలూరిపేట ఎమ్మెల్యేలు డాక్టర్ చదలవాడ అరవిందబాబు, ప్రత్తిపాటి పుల్లారావు, రాయల శ్రీనివాసరావు, షేక్ అలీబాషా, దరువూరి నాగేశ్వరరావు, శివ నాగమల్లేశ్వరరావు, ఎలినేడి రామస్వామి, వందనాదేవి, మొక్కపాటి రామచంద్రరరావు, పులిమి రామిరెడ్డి, పూజల వెంకట కోటయ్య, అంకాళ్ళ ప్రభుదాసు, గట్టినేని రమేష్, నెల్లూరి సదాశివరావు పాల్గొన్నారు.

సీహెచ్‌ఓల..
సమస్యల పరిష్కారానికి వినతి

గుంటూరు సిటీ, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): వైద్య, ఆరోగ్య శాఖలో పనిచేస్తున్న సీహెచ్‌ఓ(కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్)లు తమ సమస్యలు వెంటనే పరిష్కరించాలని రాష్ట్ర అధికారులకు వినతి పత్రం సమర్పించారు. శనివారం మంగళగిరిలోని కమిషనర్ ఆఫ్ ఫ్యామిలీ వెల్ఫేర్ కార్యాలయంలో ఎస్ఓ ప్రకాష్‌రావు, స్టేట్ నోడల్ ఆఫీసర్ శ్యామల, స్టేట్ ప్రోగ్రాం ఆఫీసర్ సుబ్రహ్మణ్యంను కలసి తమ సమస్యలు ఏకరువు పెట్టారు. ఆరేళ్ల సర్వీస్ పూర్తయిన వారిని క్రమబద్ధీకరించాలని, బకాయిలు వెంటనే చెల్లించాలని కోరారు. బదిలీ లకు అవకాశం కల్పించాలని విన్నవించారు. త్వరలోనే సమస్యలు పరిష్కరించేందుకు అధికారులు హామీ ఇచ్చినట్లు సమాచారం. గుంటూరు జిల్లా ఏపీఎంసీఏ ప్రధాన కార్యదర్శి పల్లపాటి లింగరాజు, నెల్లూరు జిల్లా అధ్యక్షుడు భాను మహేష్, నవీన్, వర్షిణి, నీలిమ పాల్గొన్నారు.

ప్రకాశం బ్యారేజి..
దిగువకు 36,250 క్యూసెక్కులు

తాడేపల్లి టౌన్, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): ఎగువ ప్రాజెక్టుల నుంచి నీటిని విడుదల చేస్తుండడంతో ప్రకాశం బ్యారేజి వద్ద కృష్ణానది వరద ఉధృతి స్వల్పంగా కొనసాగుతోంది. ఎగువన పులిచింతల ప్రాజెక్టుతోపాటు మున్నేరు, వెలగలేరు, కీసర తదితర ప్రధాన వాగుల నుంచి 51,281 క్యూసెక్కుల వరద నీరు శనివారం ఇన్‌ఫ్లోగా నమోదు అవుతున్నట్టు ఇరిగేషన్ జేఈ రాజేష్ తెలిపారు. బ్యారేజి రిజర్వాయర్‌లో 12 అడుగుల నీటిమట్టం కొనసాగుతుండగా దిగువకు 36,250 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. తూర్పు డెల్టా కాలువకు 8,328, పశ్చిమ డెల్టాకు 6,522, గుంటూరు చానల్‌కు 181 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

పత్తి.. పతనం

(5వ పేజీ తరువాయి)

ఉండదన్న భావనతో ఎక్కువ గానే పత్తి సాగు చేస్తున్నారు. అయితే ఈ ఏడాది అధిక వర్షపాతం వల్ల రైతులు అంచనాలు తల్లకిందులు అవుతున్నాయి. వర్షం ఎక్కువగా కురవడం పత్తికి శాపంగా మారింది. నెమ్ము ఎక్కువగా ఉందని వ్యాపారులు ధర తగ్గించి కొనుగోలు చేస్తున్నారు.

పల్నాడు జిల్లాలో పత్తి అమ్మకాలు ఎక్కువగా జరుగుతున్నాయి. నిల్వ చేసుకునే అవకాశం లేకపోవడంతో తీసిన పత్తిని తీసినట్లు అమ్మాల్సిన పరిస్థితి నెలకొంది. రేపోమాపో సీసీఐ కేంద్రాలు తెరిచే అవకాశం ఉన్నా పెట్టుబడి పెట్టిన వ్యాపారులు ఒత్తిడితో రైతులు తెల్ల బంగారాన్ని తెగనమ్ముకుంటున్నారు.

సీసీఐతోనే.. మద్దతు

కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(సీసీఐ) కొనుగోలు కేంద్రాలు ఈ నెల 21 నుంచి తెరుస్తామని చెబుతుంది. ఈ ఏడాది సీసీఐ పత్తి క్వింటాల్ ధర మొదటి శ్రేణి రూ.8,110, దిగువ శ్రేణికి రూ.7,710 వరకు మద్దతు ధర గా నిర్ణయించారు. అయితే పత్తి తీతలు మొదలు పెట్టి రైతులు నిల్వ చేసుకునే అవకాశం లేకపోవడం.. అడపాదడపా వర్షాలతో తీసిన పత్తిని తీసినట్లు విక్రయిస్తున్నారు. ఇదే అవకాశంగా వ్యాపారులు ధరలు తగ్గించి ఇష్టారీతిన కొనుగోలు చేస్తుండగా తప్పనిసరి పరిస్థితుల్లో సాగుదారులు అమ్ముకుంటున్నారు. సీసీఐ కేంద్రాలు తెరిస్తే వ్యాపారులు కూడా కొంత మేరకు ధరలు పెంచి కొనుగోలు చేసే అవకాశం ఉంది.

మణిపాల్ హాస్పిటల్ సరికొత్త రికార్డు


వివరాలు వెల్లడిస్తున్న వైద్యులు

తాడేపల్లి టౌన్, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): మణిపాల్ ఆసుపత్రి విజయవాడ మరో మైలురాయిని దాటింది. అన్నవాహికలో సమస్యల వల్ల మింగడంలో ఇబ్బందులు కలిగించే అకలాసియా కార్డియా అనే అరుదైన వ్యాధితో బాధపడుతున్న రోగుల కోసం 200 పర్ ఓరల్ ఎండోస్కోపి మయోటమి (పీఓఈఎం) ప్రొసీజర్లను విజయవంతంగా పూర్తి చేసింది. గ్యాస్ట్రో ఎంటరాలజీ కన్సల్టెంట్ డాక్టర్ బత్తిని రాజేష్, డాక్టర్ రాజేష్‌చంద్ర బృందానికి ఈ ఘనత దక్కుతుందని మణిపాల్ వైద్యశాలలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వైద్యులు వెల్లడించారు. పలువురు వైద్యులు మాట్లాడుతూ ఆంధ్రా తెలంగాణలో ఇప్పటి వరకు ఇంత పెద్ద సంఖ్యలో పీఓఈఎం ప్రొసీజర్లు చేసిన ఏకైక వైద్యశాల మణిపాల్ అన్నారు. ఈ విజయానికి ప్రతీకగా పీఓఈఎం ప్రొసీజర్‌పై మణిపాల్ హాస్పిటల్ ఒక ప్రత్యేకమైన వర్క్‌షాప్, కాన్ఫరెన్స్‌ను నిర్వహించగా.. రాష్ట్రం నలుమూలల నుంచి 15 మంది గ్యాస్ట్రో ఎంటరాలజిస్టులు హాజరయ్యారన్నారు. డాక్టర్ బత్తిన రాజేష్ మాట్లాడుతూ అకలాసియా కార్డియా అనే అరుదైన వ్యాధి ప్రతి లక్ష మందిలో సుమారు 10 మందికి వస్తుందన్నారు. దీని వల్ల ఆహారం మింగడం కష్టమవుతుందని ఛాతిలో నొప్పి, తిన్నది తిరిగి పైకి రావడం వంటి సమస్యలు వస్తాయని చెప్పారు. చాలామందికి తిన్న ఆహారం గొంతులోనో, ఛాతిలోనో ఆగిపోయినట్టు ఉంటుందని చెప్పారు. అలాగే దగ్గు, గుండె మంట, తరచుగా ఊపిరితిత్తుల ఇన్‌ఫెక్షన్ రావడం కూడా ఉంటుందన్నారు. చాలామంది దీన్ని గ్యాస్ సమస్యగా తప్పుగా భావిస్తారని చెప్పారు. అకలాసియా అంటే అన్నవాహిక నరాలు పాడవడం వల్ల అన్నవాహిక కండరాలు సరిగ్గా పని చేయక పోవడం జరుగుతుందని చెప్పారు. ఈ వ్యాధిని గుర్తించడానికి ఎండోస్కోపి, బేరియం ఎక్స్‌రే, ఈసోఫోగల్, మేనోమెట్రి వంటివి ఉపయోగిస్తారన్నారు. డాక్టర్ రాజేష్ చంద్ర మాట్లాడుతూ 200 పీఓఈఎం ప్రొసీజర్లు పూర్తి చేయడం తమ బృందానికి పెద్ద మైలురాయి అని పేర్కొన్నారు. రోగులకు ఉత్తమ ఫలితాలు ఇవ్వడమే తమ లక్ష్యమన్నారు.

కాటికాపరి దారుణ హత్య


ఘటనా స్థలాన్ని పరశీలిస్తున్న డీఎస్పీ హనుమంతరావు

నరసరావుపేట రూరల్, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని నకరికల్లు రోడ్డులో ఉన్న స్వర్గపురి -2లో కాటికాపరిగా పని చేస్తున్న గడ్డిపర్తి ఎఫ్రాన్ (31)ను శుక్రవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు అతి కిరాతకంగా గొడ్డలితో నరికి హత్య చేశారు. స్థానిక క్రిష్టియన్‌పాలేనికి చెందిన ఎఫ్రాన్ 18 నెలలుగా స్వర్గపురి - 2లో కాటికాపరిగా పనిచేస్తున్నాడు. నరసరావుపేట ఇన్‌చార్జి డీఎస్పీ హనుమంతరావు, రూరల్, పట్టణ సీఐలు రామకృష్ణ, ఫిరోజ్, హైమారావు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. పాత కక్షల నేపథ్యంలో హత్య జరిగి ఉండవచ్చని మృతుని బంధువులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. క్లూస్‌టీం ఆధారాలు సేకరించింది. మృతుడి సోదరుడు రమేష్‌బాబు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్ఐ ఫిరోజ ఫాతిమా తెలిపారు.

కాల్వలో దూకి వృద్ధురాలి ఆత్మహత్య

కొల్లూరు, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): కాల్వలో దూకి ఓ వృద్ధురాలు ఆత్మహత్య చేసుకుంది. స్థానికులు కాపాడినప్పటికీ ఫలితం లేకుండా పోయింది. స్థానికుల వివరాల మేరకు.. సుగ్గునలంక గ్రామానికి చెందిన సుగ్గున వెంకటసుబ్బమ్మ (75) అదే గ్రామంలో తన కుమార్తె వద్ద నివాసం ఉంటోంది. ఇటీవల శ్వాస సంబంధిత వ్యాధితో బాధపడుతూ వైద్యశాలలో చేరి వారం క్రితం ఆరోగ్యం మెరుగుపడడంతో ఇంటికి వచ్చింది. శనివారం సుగ్గునలంక నుంచి కొల్లూరు చేరుకుని రేపల్లె బ్యాంకు కెనాల్‌లో దూకింది. ఇది గమనించిన స్థానికులు వెంటనే కాల్వలోకి దూకి ఆమెను ఒడ్డుకు చేర్చారు. ఆమె తన వివరాలు వెల్లడించి ఒక్కసారిగా కుప్పకూలిపోయింది. సమాచారం తెలుసుకున్న వృద్ధురాలి కుటుంబ సభ్యులు మృతదేహాన్ని తీసుకువెళ్లారు. ఈ ఘటనపై తమకు ఎటువంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

22న మెగా జాబ్ మేళా

గుంటూరు(తూర్పు), అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): స్థానిక పట్టాభిపురంలో అబుల్ కలాం ఆజాద్ ఉర్దూ ఘర్ కమ్ షాదీ ఖానాలో ఈ నెల 22న మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్టు బ్రైట్ హారిజన్స్ ఫౌండేషన్ చైర్మన్ ఎంకేఎస్ మొహియుద్దీన్ తెలిపారు. ఈ జాబ్ మేళాలో బ్యాంకింగ్, బీమా, ఆరోగ్య, ఇంజనీరింగ్, ఫార్మా రంగాలకు చెందిన దాదాపు 40 కంపెనీల ప్రతినిధులు పాల్గొంటున్నట్లు పేర్కొన్నారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటలకు జాబ్ మేళా కొనసాగుతుందని వివరించారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు 5 సెట్ల బయోడేటాతో హాజరవ్వాలని తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు.

గుంటూరు సిటీ వార్తలు

◆ గుంటూరు తూర్పు ◆ పశ్చిమ

వైద్య సేవలు విస్తృతం చేయాలి : కలెక్టర్



కలెక్టరేట్‌లో వైద్య ఆరోగ్య శాఖ కార్యకలాపాలపై సమీక్ష నిర్వహిస్తోన్న కలెక్టర్ అన్సారియా

గుంటూరు, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో వైద్యసేవలు విస్తృతం చేయాలని కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా ఆదేశించారు. ప్రతి ప్రాథమిక, సామాజిక ఆరోగ్య కేంద్రంలో ఔట్ పేషెంట్ (ఓ.పి) సేవలు మెరుగుపడాలన్నారు. ఓ.పి సేవలు మెరుగు పరచడంతో పాటు ప్రసవాలు ప్రభుత్వ ఆసుపత్రులలోనే జరగాలని స్పష్టం చేశారు. వైద్య ఆరోగ్య శాఖ కార్యకలాపాలపై శనివారం ఆమె కలెక్టరేట్‌లో సమీక్షించారు. కొల్లిపర సీహెచ్‌సీలో ఒక్క ప్రసవం కూడా కాకపోవడం, పొన్నూరులో 10, ప్రత్తిపాడులో ఒక ప్రసవం మాత్రమే జరగడంపై ప్రశ్నించారు. పొన్నూరులో 80 శాతం ఓపీ ఉండటం, మిగిలిన ఆసుపత్రుల్లో 50 శాతం వరకు ఉండటం, జిల్లా ఆసుపత్రిలో సైతం 58 శాతం మాత్రమే ఉండటం సరికాదన్నారు. అవసరమైతే వైద్యుల సర్దుబాటు చేయాలని తద్వారా మెరుగైన సేవలు అందించాలని ఆదేశించారు. రాష్ట్రీయ బాల స్వాస్థ్య కార్యక్రమం కింద వివిధ కారణాల వలన వయసుకు తగిన ఎదుగుదల, బరువు లేని చిన్నారులను గుర్తించి విశ్లేషణ చేయాలని ఆదేశించారు. జిల్లాలో ఇప్పటి వరకు ఎంతమంది చిన్నారులకు చికిత్స చేయించారని ప్రశ్నించారు. దీపావళి అనంతరం విద్యార్థుల ఆరోగ్య పరీక్షలకు ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు.

మాతృ మరణాలు జరిగితే ఉపేక్షించేది లేదు

హై రిస్క్ గర్భిణులపై ప్రత్యేక పర్యవేక్షణ ఉండాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఆశా స్థాయి నుంచి ప్రతి రోజు పర్యవేక్షణ జరగాలన్నారు. నివారించ దగ్గ మాతృ మరణాలు జరిగితే ఆశా, ఏఎన్ఎంతో సంబంధిత సిబ్బందిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గర్భిణీల్లో రక్త హీనత లేకుండా చూడాలని, పౌష్టిక ఆహారం పక్కాగా అందాలన్నారు. ప్రభుత్వ సమగ్ర ఆసుపత్రి సూపరింటెండెంట్ రమణ యశస్వి ప్రభుత్వ సమగ్ర ఆసుపత్రిని గురించి వివరించారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి కే.విజయలక్ష్మి మాట్లాడుతూ హై రిస్క్ గర్భిణులు 21 శాతం ఉన్నారన్నారు. గర్భిణుల నమోదు 74 శాతం పూర్తి అయిందన్నారు. జిల్లా ఆసుపత్రుల సమన్వయ అధికారి బి.వి.రంగా రావు మాట్లాడుతూ కొన్ని వైద్యుల పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. కొల్లిపర సీహెచ్‌సీలో రక్త నిధి కేంద్రం ఏర్పాటుకు లైసెన్స్ కోసం దరఖాస్తు చేశామన్నారు. తెనాలిలో ఉన్న జిల్లా ఆసుపత్రికి బ్లడ్ కాంపోనెంట్ యూనిట్ మంజూరైందన్నారు. జిల్లా ఆసుపత్రిలో రూ.47 కోట్లతో ఎంసీహెచ్, క్రిటికల్ కేర్ యూనిట్ నిర్మాణం జరుగుతోందని, 75 శాతం పనులు పూర్తి అయ్యాయని వివరించారు.

ఎన్.టి.ఆర్ వైద్యసేవ జిల్లా సమన్వయ అధికారి విజయ్ మాట్లాడుతూ జిల్లాలో 94 ఆసుపత్రులు ఎన్.టి.ఆర్ వైద్యసేవ కింద నమోదై ఉన్నాయని వాటిలో 34 సమ్మెలో పాల్గొంటున్నాయని చెప్పారు. జిల్లాలో 6.06 లక్షల ఎన్.టి.ఆర్ వైద్య సేవ కార్డులు ఉన్నాయని చెప్పారు. ఈ సందర్భంగా అంతర్జాతీయ బాలికా దినోత్సవంపై నిర్వహించిన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు సర్టిఫికెట్, చెక్కులను కలెక్టర్ పంపిణీ చేశారు. ఈ సమావేశంలో వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యుత్ సేవలను అందించాలి

గుంటూరు, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రజలకు నాణ్యమైన విద్యుత్ సేవలు అందించేలా విద్యుత్‌శాఖ అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేయాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ సమావేశ మందిరంలో విద్యుత్ ట్రాన్స్‌కో, నెడ్ క్యాప్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. జిల్లాలోని విద్యుత్ ఆపరేషన్ సర్కిల్ వివరాలు, గృహ విద్యుత్ వినియోగం, లభ్యత, విద్యుత్ మౌలిక సౌకర్యాల అభివృద్ధి పనులు, సూర్య ఘర్ యూనిట్లు, సోలార్ ప్లాంట్‌ల అంశాలపై అధికారులు పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. కలెక్టర్ మాట్లాడుతూ, సూర్యఘర్ పథకం ద్వారా రూఫ్ టాప్ సోలార్ యూనిట్లు ఏర్పాటు ప్రక్రియను ప్రారంభించాలన్నారు. కాకుమానువారితోట సమీపంలో సబ్‌స్టేషన్ ఏర్పాటుకు అవసరమైన స్థలం కేటాయింపునకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. కార్యక్రమంలో సీపీడీసీఎల్ గుంటూరు సర్కిల్ ఆపరేషన్ ఎస్ఈ చల్లా రమేష్, సీఆర్‌డీఏ ఈఈ జె.హరిబాబు, ట్రాన్స్ కో ఎస్ఈ పీఆర్‌సీ ప్రసాద్, నెడ్ క్యాప్ జూనియర్ మేనేజర్ జి.వికాస్, సీపీవో కార్యాలయం సూపరింటెండెంట్ సత్యనారాయణరాజు తదితరులున్నారు.

అభివృద్ధికి కూటమి ప్రభుత్వం చిరునామా

● తూర్పు ఎమ్మెల్యే నసీర్

● రూ.2.32 కోట్లతో సీసీ డ్రెయిన్లు, బీటీ రోడ్లకు శంకుస్థాపన

గుంటూరు, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధికి చిరునామా కూటమి ప్రభుత్వమని తూర్పు ఎమ్మెల్యే నసీర్ అన్నారు. గుంటూరు తూర్పు నియోజకవర్గంలో శనివారం మేయర్ రవీంద్రతో కలిసి ఆయన రూ. 2.32 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, నగరంలోని నార్త్ ప్యారిస్ చర్చి నుంచి ఎన్టీఆర్ ఐలాండ్ వరకు రూ.99 లక్షలతో డ్రెయిన్ నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు. పొన్నూరు రోడ్డుకు ఇరువైపులా రూ.1.33 కోట్లతో బీటీ రోడ్లు నిర్మిస్తున్నామని చెప్పారు. చేపట్టిన పనులు నాణ్యతా ప్రమాణాలతో నిర్ణీత కాలంలో పూర్తి చేయాలని సూచించారు. పనులను అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలన్నారు. కూటమి ప్రభుత్వ పాలన నవచరిత్రకు నాంది అని పేర్కొన్నారు. గుంటూరు నగరంలో గత ఐదేళ్ల కాలంలో ఎటుచూసినా అభివృద్ధిపై నిర్లక్ష్యమే కనిపించిందని, కనీసం మురుగు రోడ్లు కూడా నిర్మించలేని దౌర్భాగ్యపాలన సాగించారని విమర్శించారు. తాము అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రతి ప్రాంతంలో మౌలిక సదుపాయాల కల్పనపై దృష్టి సారించామని ఎమ్మెల్యే నసీర్ తెలిపారు.



శంకుస్థాపన చేస్తున్న మేయర్ రవీంద్ర, ఎమ్మెల్యే నసీర్

వైద్య పితామహుడు ధన్వంతరికి నివాళులు

వైద్యాన్ని ప్రచారం చేసి సకల జనులకు ఆరోగ్యాన్ని ప్రసాదించిన ఘనత ధన్వంతరికి దక్కుతుందని ఎమ్మెల్యే నసీర్ అన్నారు. నాయీ బ్రాహ్మణుల ఆధ్వర్యంలో తూర్పు ఎమ్మెల్యే కార్యాలయంలో శనివారం ధన్వంతరి జయంతి నిర్వహించారు. ధన్వంతరి చిత్రపటానికి ఆయన నివాళులర్పించి మాట్లాడారు. భారతదేశ ఆయుర్వేద వైభవాన్ని ప్రపంచానికి చాటి చెప్పిన ప్రథమ వైద్యులు ధన్వంతరి అని కొనియాడారు.

నేడు పేద విద్యార్థులకు ఉపకార వేతనాల పంపిణీ



తులసీ సీడ్స్ ఎండీ తులసీ యోగీష్‌చంద్ర

గుంటూరు, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): 'కృష్ణదేవ రాయ ఎయిడ్ ఫర్ పూర్ అండ్ అండర్ ప్రివిలేజ్డ్-గుంటూరు' 'రోఫా - కర్నూలు' వారి సంయుక్త ఆధ్వర్యంలో చదువులో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ఆదివారం ఉపకార వేతనాలను పంపిణీ చేయనున్నట్లు తులసీ సీడ్స్ మేనేజింగ్ డైరక్టర్ తులసీ యోగీష్‌చంద్ర తెలిపారు. మొత్తం 163 మంది పేద విద్యార్థులకు రూ.7 లక్షల 45వేలు ఉపకార వేతనాలుగా పంపిణీ చేస్తారన్నారు. ఇందులో రూ. 3 లక్షల 75వేలు తులసి సీడ్స్ వారు కృష్ణదేవరాయ ఎయిడ్ ఫర్ పూర్ అండ్ అండర్ ప్రివిలెజ్డ్ ద్వారా పేద విద్యార్థులకు అందిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమం కర్నూలులోని జిల్లా పరిషత్ మెయిన్ హాల్‌లో ఉదయం 10 గంటలకు ప్రారంభమవుతుందని చెప్పారు. ముఖ్య అతిథిగా తులసీ గ్రూప్ చైర్మన్ తులసి రామచంద్రప్రభు హాజరై వితరణ చేయనున్నారని ఎండీ తులసి యోగీష్‌చంద్ర తెలిపారు.

నేటి నుంచి రెవెన్యూ క్రీడా పోటీలు

గుంటూరు (క్రీడలు), అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎన్టీఆర్ స్టేడియంలో ఆదివారం నుంచి రెవిన్యూ ఉద్యోగుల క్రీడా పోటీలు ప్రారంభం కానున్నాయి. ఈ పోటీలలో ప్రతిభ కనబరిచిన ఉద్యోగులను అనంతపురంలో జరగనున్న ఏపీ రాష్ట్రస్థాయి రెవెన్యూ క్రీడా పోటీలకు ఎంపిక చేయనున్నట్లు నిర్వాహకుడు వెంకటరావు తెలిపారు. ఈ పోటీలలో పాల్గొనే రెవెన్యూ క్రీడాకారులు తప్పక తమ పేర్లను నమోదు చేయించుకోవాలని, ఇతర వివరాలకు 9652008200 నంబర్‌ను సంప్రదించాలని వెంకటరావు చెప్పారు.

రేపటి పీజీఆర్ఎస్ రద్దు

గుంటూరు(తూర్పు), అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): దీపావళి పురస్కరించుకుని సోమవారం జరిగే ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని రద్దు చేసినట్టు కలెక్టర్ తమీమ్ అన్సారియా ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా ప్రజలు ఈ విషయాన్ని గమనించి, అధికార యంత్రాంగానికి సహకరించాలని కోరారు.

8, 9వ తేదీల్లో రాష్ట్రస్థాయి సాంస్కృతిక పోటీలు

● డాక్టర్ మన్నవ రాధాకృష్ణమూర్తి, నడింపల్లి వెంకట గురుదత్

గుంటూరు (విద్య), అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): బాలనంద కేంద్రం ఆధ్వర్యంలో బాలల దినోత్సవం రుద్ర కళాక్షేత్రం సహకారంతో "బాల కళాప్రభ -2025" రాష్ట్రస్థాయి సాంస్కృతిక పోటీలు వచ్చే నెల 8, 9వ తేదీల్లో నిర్వహిస్తున్నట్లు అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ మన్నవ రాధాకృష్ణ మూర్తి, నడింపల్లి వెంకట గురుదత్ వెల్లడించారు. ఈ మేరకు శనివారం పోస్టర్స్ ఆవిష్కరించారు. రుద్ర కళాక్షేత్రం నిర్వాహకులు మాచిరాజు రాజేశ్ మాట్లాడుతూ, ఉభయ తెలుగు రాష్ట్రాలలోని ఔత్సాహిక కూచిపూడి నృత్య విద్యార్థులను ప్రోత్సహించేందుకు నృత్య ప్రభ (సోలో), నృత్యమణి (గ్రూపు) పోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కళా పోటీలలో శాస్త్రీయ, జానపద నృత్యాలు, తెలుగు పద్యం, సంస్కృత శ్లోకం, తెలుగులో మాట్లాడదాం చిత్రలేఖనం, రంగుల వేద్దాం రండి, శాస్త్రీయ గాత్ర సంగీతం, లలిత గీతాలు, వాద్య సంగీతం పోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ప్రతి దశలో జూనియర్ సీనియర్ రంగాలలో పోటీలు జరుగుతాయని పాల్గొన్న ప్రతి అంశానికి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు, ప్రశంసా పత్రాలు అందజేస్తామని వెల్లడించారు. మరిన్ని వివరాలకు 91826 85890, 7382153390 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

విద్యార్థులు నిర్దేశిత లక్ష్యంతో ముందుకు సాగాలి

గుంటూరు (తూర్పు), అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు నిర్దేశిత లక్ష్యంతో ముందుకు సాగాలని కెనరా బ్యాంక్ రిటైర్డ్ అసిస్టెంట్ జనరల్ మేనేజర్ బి.నర్సిరెడ్డి సూచించారు. స్థానిక నగరంపాలెంలో రెడ్డి జన సేవా సమితి, రెడ్డి జనాభ్యుదయ మండలి ఆధ్వర్యంలో ఉడుముల నర్సిరెడ్డి వర్ధంతిని పురస్కరించుకొని విద్యార్థులకు ఉపకార వేతనాలు అందజేశారు. ఈ సందర్భంగా బి.నర్సిరెడ్డి మాట్లాడుతూ, ఉడుముల నర్సిరెడ్డి ఎంతో ఉన్నతంగా ఆలోచించి, ఈ వసతి గృహాన్ని ఏర్పాటు చేశారన్నారు. ఆయన స్ఫూర్తి, దాతలు ఇచ్చిన సహకారంతో విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ముఖ్య అతిథులుగా ప్రముఖ కార్డియాలజిస్ట్ జీఎస్ శ్రీనివాస్‌రెడ్డి, డాక్టర్ వెలగల జయపాల్ రెడ్డి పాల్గొని విద్యార్థులకు ఉపకార వేతనాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో చల్లా అంజిరెడ్డి, కంది సంజీవరెడ్డి, సూరసాని వెంకటరెడ్డి, పడాల సుబ్బారెడ్డి, పోలూరి వెంకటరెడ్డి, జంగా సత్యనారాయణ రెడ్డి, వణుకూరి సూరారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు ప్రశంసా పత్రాలను అందజేస్తున్న బ్యాంకు విశ్రాంత జీఎం బి.నర్సిరెడ్డి

పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం : షేక్ రషీద్

గుంటూరు, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం సాధ్యమవుతుందని టీడీపీ సీనియర్ నాయకుడు షేక్ రషీద్ అన్నారు. స్థానిక రిజిస్ట్రార్ కార్యాలయం టాయిలెట్స్ వద్ద శనివారం స్వచ్ఛ గుంటూరు కార్యక్రమంలో భాగంగా పరిసరాలు శుభ్రం చేశారు. గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గల్లా మాధవి ఆదేశాల మేరకు ఈ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. నగరంలో ప్రతి ఒక్కరూ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో షేక్ నసీమ, చెరుకూరి రాణి, షేక్ జమీర్ తదితరులు పాల్గొన్నారు.

కాలుష్య రహిత సమాజానికి సౌర విద్యుత్ వినియోగం తప్పనిసరి

● సూపర్ జీఎస్టీ-సూపర్ సేవింగ్స్ కార్యక్రమంలో ఎస్ఈ రమేష్

గుంటూరు, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): కాలుష్య రహిత సమాజం కోసం సౌర విద్యుత్ వినియోగాన్ని తప్పనిసరిగా స్వాగతించాలని గుంటూరు సర్కిల్ ఆపరేషన్స్ ఎస్ఈ చల్లా రమేశ్ పేర్కొన్నారు. సంగడిగుంటలోని విద్యుత్ భవన్‌లో సూపర్ జీఎస్టీ-సూపర్ సేవింగ్స్ కార్యక్రమంలో భాగంగా అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఎస్ఈ మాట్లాడుతూ జీఎస్టీ 2.0 సంస్కరణలతో సౌర శక్తి పరికరాలపై భారీగా పన్ను తగ్గిందన్నారు. గతంలో 12 శాతం ఉండగా, ఇప్పుడు 5 శాతానికి చేరుకుందన్నారు. అలానే పవనశక్తి, జల విద్యుత్ పరికరాలు గతంలో 12 శాతం ఉండగా ఇప్పుడు 5 శాతం జాబితాలోకి చేరాయని చెప్పారు. ఇంటి పైకప్పుపై సోలార్ పలకలు ఏర్పాటు చేసుకోవటం ద్వారా విద్యుత్ బిల్లును ఆదా చేసుకోవచ్చన్నారు. 5 హెచ్‌పీ సౌర పంపు ధర గతంలో రూ. 2 లక్షల 50వేలు ఉండగా, ఇప్పుడు రూ.2 లక్షల 21వేలకు దొరుకుతుందని తెలిపారు. కార్యక్రమంలో గుంటూరు టౌన్-1 డివిజన్ ఆపరేషన్ ఈఈ టి.శ్రీనివాసబాబు, టెక్నికల్ ఈఈ పి.నాగేశ్వరరావు, ఎస్ఏవో పాశం రామిరెడ్డి, ఏఈ (కన్‌స్ట్రక్షన్) చాగంటి వీరారెడ్డి, కార్పొరేటర్‌లు సంకూరి శ్రీనివాసరావు, మీరావలి, ఖాజా మొహిద్దీన్‌చిష్టీ పలువురు పాల్గొన్నారు.



జీఎస్టీ 2.0 సంస్కరణలపై అవగాహన కల్పిస్తున్న ఎస్ఈ రమేశ్, ఈఈ శ్రీనివాసబాబు తదితరులు

క్వారీ పనుల్లో రిజర్వేషన్ల ప్రకటన హర్షణీయం

● వడ్డెర కార్పొరేషన్ చైర్మన్ మల్లె ఈశ్వరరావు

గుంటూరు (తూర్పు), అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): క్వారీ పనుల్లో వడ్డెరలకు 15 శాతం రిజర్వేషన్లు కల్పించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటన చేయడం హర్షణీయమని వడ్డెర కార్పొరేషన్ చైర్మన్ మల్లె ఈశ్వరరావు అన్నారు. హౌసింగ్‌బోర్డు కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఎన్నికల ప్రచారంలో భాగంగా ఇచ్చిన హామీని నెరవేరుస్తున్నందుకు ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ నిర్ణయంతో వడ్డేరలు ఆర్థికాభివృద్ధి దిశగా పయనిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. దీనిపై క్యాబినెట్‌లో చర్చించి, చట్టబద్ధత కల్పించేందుకు కార్యచరణ రూపొందిస్తున్నట్టు తెలిపారు. త్వరలోనే ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి నారాలోకేష్‌ను కలిసి కృతజ్ఞతలు తెలుపుతామని ఆయన పేర్కొన్నారు.

మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించాలి

● మెప్మా పీడీ విజయలక్ష్మి

గుంటూరు, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకొని మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించాలని మెప్మా పీడీ విజయలక్ష్మీ కోరారు. దళిత బహుజన రీసోర్స్ సెంటర్ ఆధ్వర్యంలో జీవనోపాధి కార్యక్రమంలో భాగంగా శారదాకాలనీలో పది మంది హెయిర్ పిక్కర్లకు రూ. లక్ష విలువైన అల్యూమినియం సామాగ్రి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, మహిళలు స్వయం సహాయక సంఘాలుగా, పురుషులు సామాన్య ఆసక్తి గ్రూపులుగా చేరి జీవనోపాధిని అభివృద్ధి చేసుకోవాలని కోరారు. అట్టడుగు వర్గాల అభివృద్ధి కోసం డీబీఆర్‌సీ చేస్తోన్న కృషి అభినందనీయమని కొనియాడారు. కార్యక్రమంలో చుక్కా శామ్యూల్ అనీల్‌కుమార్, జిల్లా ప్రోగ్రామ్ కో ఆర్డినేటర్ మల్లెల చిన్నప్ప, వడ్డే రవిజేత, రవికాంత్, శ్రీవాణి, సఖి, శాంతి తదితరులున్నారు.

తురకపాలెంలో మరణాలపై నిపుణుల కమిటీ వేయాలి

● కలెక్టర్‌కు వైసీపీ నేతల వినతి

గుంటూరు, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): గుంటూరు రూరల్ మండలం తురకపాలెంలో వరుస మరణాలపై నిపుణుల కమిటీని వేయాలని కలెక్టర్ తమీమ్ అన్సారియాకు వైసీపీ ఎంపీ ఆళ్ల అయోధ్య రామిరెడ్డి, ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబు, ఎమ్మెల్సీ లేళ్ళ అప్పిరెడ్డి కోరారు. కలెక్టర్‌ను శనివారం ఆమె చాంబర్‌లో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ, తురకపాలెంలో మరణాలను ప్రభుత్వం గుర్తించి, వాటికి గల కారణాలను విశ్లేషించాలన్నారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో వైసీపీ నగర అధ్యక్షురాలు షేక్ నూరిఫాతిమా, ఎమ్మెల్సీ చంద్రగిరి ఏసురత్నం, మాజీ మంత్రి మేకతోటి సుచరిత, మాజీ ఎంపీ మోదుగుల వేణుగోపాల్‌రెడ్డి, నేతలు పోతిన మహేష్, బలసాని కిరణ్‌కుమార్, అంబటి మురళి, దొంతిరెడ్డి వేమారెడ్డి, వనమా బాల వజ్రబాబు, గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, గజ్జల సుధీర్ భార్గవ్‌రెడ్డి, మొండితోక జగన్ మోహన్‌రావు, షేక్ గులాం రసూల్ తదితరులున్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

గుంటూరు, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణ ప్రజలందరి బాధ్యతని 56వ డివిజన్ కార్పొరేటర్ ఆయిశెట్టి కనకదుర్గ శ్రీనివాస్ అన్నారు. స్వచ్ఛాంధ్ర, స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా నెహ్రూనగర్‌లో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆక్స్‌ఫర్డ్ విద్యార్థులతో కలిసి పర్యావరణంపై అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు.



ప్రసంగిస్తున్న సతీష్, వేదికపై కేఎస్ లక్ష్మణరావు తదితరులు

ఎల్ఐసీ మరింత శక్తివంతం కావాలి

● యూనియన్ జోనల్ అధ్యక్షుడు పి.సతీష్

గుంటూరు(తూర్పు), అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : దేశ ఆర్థిక ప్రయోజనాల దృష్ట్యా ఎల్ఐసీ మరింత శక్తివంతం కావాలని ఎల్ఐసీ యూనియన్ జోనల్ అధ్యక్షుడు పి.సతీష్ అన్నారు. గుంటూరు, ఎన్జీవో కల్యాణమండపంలో శనివారం డివిజన్ అధ్యక్షుడు జె.సుధాకర్ అధ్యక్షతన ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఎంప్లాయీస్ యూనియన్, మచిలీపట్నం డివిజన్ 57వ మహాసభలు జరిగాయి. ముఖ్య అతిథిగా హాజరైన సతీష్ మాట్లాడుతూ సామాజిక రంగాలకు లక్షల కోట్ల రూపాయల పెట్టుబడులను సమకూరుస్తూ దేశ ప్రగతికి ఎల్ఐసీ అంకితమైందన్నారు. ఇటీవల ఒక వైపు స్వదేశీ అంటూ నినాదమిచ్చిన కేంద్ర ప్రభుత్వం.. మరో వైపు బీమా రంగంలో విదేశీ ఈక్విటీని నూరు శాతానికి పెంచాలని నిర్ణయించడం దేశ ప్రయోజనాలకు హానికరమన్నారు. మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ సామాజిక చైతన్యం కలిగిన బీమా ఉద్యోగులు ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడుకునేందుకు సమైక్య పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో యూనియన్ సభ్యులు జి.తిరుపతయ్య, కోటేష్ బాబు, సురేష్ బాబు, బి.లక్ష్మణరావు, జి.కిషోర్ కుమార్, సీహెచ్ మధుబాల తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై ప్రజల్లో గౌరవం పెరిగేలా పని చేయాలి

● రావిపాటి సాయికృష్ణతో సీఎం చంద్రబాబు



సాయికృష్ణకు బార్ కౌన్సిల్ మంజూరు చేసిన ధ్రువపత్రాన్ని అందిస్తున్న సీఎం చంద్రబాబు

గుంటూరు, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : చట్టాలపై ప్రజల్లో గౌరవం పెరిగేలా పని చేయాలని సీఎం చంద్రబాబు సూచించారు. ఈ మేరకు శనివారం హైకోర్టు న్యాయవాదిగా బార్ కౌన్సిల్ ప్రదానం చేసిన ధ్రువప త్రాన్ని సీఎం చంద్రబాబు చేతుల మీదుగా సాయికృష్ణ అందుకున్నారు. ఏపీ హైకోర్టు ఆవరణలో బార్ కౌన్సిల్ అఫ్ ఏపి ఏర్పాటు చేసిన 35వ బ్యాచ్‌కు సంబంధించిన నూతన న్యాయవాదుల ప్రమాణ కార్యక్రమంలో ఇటీవల గుంటూరు జాగర్లమూడి చంద్రమౌళి కాలేజ్ అఫ్ లా లో లా కోర్సులో ఉత్తీర్ణుడైన రావిపాటి సాయి కృష్ణ శనివారం హైకోర్టులో బార్ కౌన్సిల్ అఫ్ ఆంధ్రప్రదేశ్ ఏర్పాటు చేసిన "ఓత్ సెర్మనీ" కార్యక్రమంలో నమోదై ప్రమాణం చేశారు. అనంతరం మంగళగిరి తెలుగుదేశం పార్టీ సెంట్రల్ ఆఫీసులో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుని మర్యాద పూర్వకంగా కలిశారు.

అమెరికా సుంకాలపై కేంద్రప్రభుత్వం స్పందించాలి : సీపీఎం

గుంటూరు (తూర్పు), అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): అమెరికా టారిఫ్‌ల పెంపునకు వ్యతిరేకంగా కేంద్రప్రభుత్వం స్పందించి ప్రభావం పడే రంగాలను ఆదుకోవాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు సీహెచ్ బాబు రావు కోరారు. బ్రాడీపేటలోని సీపీఎం జిల్లా కార్యాలయంలో శనివారం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు పాశం రామారావు అధ్యక్షతన జిల్లా కమిటీ సమావేశం జరిగింది. బాబురావు మాట్లాడుతూ, దేశ ప్రయోజనాల్ని, సార్వభౌమ త్వాన్ని అమెరికాకు తాకట్టు పెట్టే విధంగా మోదీ వ్యవహరిస్తున్నారని బాబురావు మండిపడ్డారు. జిల్లా కార్యదర్శి వై.నేతాజీ మాట్లాడుతూ రాజీవ్‌గృహకల్ప, టిడ్కో ఇళ్లకు, జగనన్న కాలనీ లకు మౌలిక వసతులు కల్పించాలని కోరారు. సమావేశంలో ఈమని అప్పారావు, ఎస్.భావన్నారాయణ, ఎన్.నళినీకాంత్, రవి, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

బాలిక కిడ్నాప్...

గుంటూరు, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): లాలాపేట పోలీసుస్టేషన్ పరిధిలో 16 సంవత్సరాల వయసు గల బాలికను తన ఇంటి దగ్గరలో నివాసముంటున్న మహంకాళి ఆంజనేయులు (38) కిడ్నాప్ చేశాడు. ఆంజనేయులుకు భార్యతో విడాకులై, ఒక అమ్మాయి, ఒక అబ్బాయి సంతానం ఉంది. బాలికకు తన కుమార్తెతోస్నేహం కలిగి ఉన్న నేపథ్యంలో ఇంటికి వస్తూ పోతూ ఉన్న క్రమంలో బాలికను పరిచయం చేసుకున్నాడు. మాయ మాటలు చెప్పి, గత మార్చి నెలలో ఆమెను ఇంట్లో నుంచి తీసుకుని పోయాడు. పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అపార్ట్‌మెంట్ వాచ్‌మన్ ఇంటిలో చోరీ

గుంటూరు, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): స్థానిక పట్టాభిపురం పోలీస్ స్టేషన్ పరిధిలోని చంద్రమౌళినగర్ 6/2లోని అపార్ట్‌మెంట్‌లో గల వాచ్‌మన్ ఇంటిలో చోరీ జరిగింది. ఏలూరి ఎలీషా అనే మహిళ ఇంటిలో రెండురోజుల క్రితం గుర్తు తెలియని వ్యక్తి చోరీకి పాల్పడ్డాడు. విశ్వతేజ అపార్ట్‌మెంట్‌కు వీరు వాచ్‌మన్‌గా పని చేస్తున్నారు. కాగా దొంగలు ఇంటిలోని రెండు జతల కమ్మలు, ఉంగరం, రెండు జతల కాళ్ళ పట్టీలు, వెండి ఉంగరం అపహరించుకుపోయారు. అపార్ట్‌మెంట్ సీసీ కెమెరాలను పరిశీలించారు. ఆధారాలు ఉన్నాయని, త్వరలోనే నిందితుడిని అరెస్టు చేస్తామని పట్టాభిపురం సీఐ గంగా వెంకటేశ్వర్లు తెలిపారు.



పీవీకే నాయుడు మార్కెట్ డిజైన్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మాధవి, పక్కన మేయర్, కమిషనర్ తదితరులు

పీవీకే నాయుడు మార్కెట్ కొత్త భవన నిర్మాణ డిజైన్‌ల పరిశీలన

గుంటూరు కార్పొరేషన్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని పీవీకే నాయుడు కూరగాయల మార్కెట్‌లో కొత్త భవన నిర్మాణానికి సిద్ధం చేసిన డిజైన్‌లను ఎమ్మెల్యే గళ్ళా మాధవి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె అధికారులకు పలు సూచనలు చేశారు. పీవీకే నాయుడు మార్కెట్ గుంటూరు నగరానికే తలమానికం కాబోతోందని అన్నారు. కొత్తగా నిర్మించబోయే మార్కెట్ భవనం ఆధునిక వసతులతో, పరిశుభ్రతతో, పర్యావరణానికి అనుకూలంగా ఉండాలని తెలిపారు. పార్కింగ్, మురుగు నీటి వ్యవస్థ, తాగునీటి సదుపాయం, వ్యర్థాల నిర్వహణ, భద్రతా ఏర్పాట్లు, రహదారి రాకపోకలు సక్రమంగా ఉండేలా ప్రణాళిక రూపొందించాలని ఎమ్మెల్యే మాధవి సూచించారు. కార్యక్రమంలో నగర మేయర్ రవీంద్ర, కమిషనర్ శ్రీనివాసులు, అధికారులు పాల్గొన్నారు.

సర్వమత సౌభ్రాతృత్వానికి ప్రతీక గ్యార్మీ

● పశ్చిమ ఎమ్మెల్యే గళ్ళా మాధవి

గుంటూరు, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): సర్వమత సౌభ్రాతృత్వానికి ప్రతీక గ్యార్మీ పండుగ అని పశ్చిమ ఎమ్మెల్యే గళ్ళా మాధవి చెప్పారు. నియోజకవర్గంలోని పలు చోట్ల శనివారం జరిగిన గ్యార్మీ వేడుకల్లో ఆమె పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు (దువా) నిర్వహించారు. తుఫాన్ నగర్, సాయి కృష్ణ నగర్, బ్రాడీపేట ఒకటో లైన్, యతిరాజునగర్‌లో జరిగిన వేడుకలకు ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. గ్యార్మీ సందర్భంగా భక్తులందరికీ అన్నదానం నిర్వహించారు.

పచ్చని పరిసరాలే ప్రగతికి పునాది

పచ్చని పరిసరాలే ప్రగతికి పునాదని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవి అన్నారు. మిర్చి యార్డు సమీపంలో మిర్చి తొడాలను తగలబెట్టకుండా ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆమె కలెక్టర్‌ను కోరారు. శనివారం గుంటూరులో జరిగిన స్వర్ణ ఆంధ్ర- స్వచ్ఛ ఆంధ్రకార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా, మేయర్ కోవెలమూడి రవీంద్ర, కమిషనర్ పులి శ్రీనివాసుతో కలిసి ఎమ్మెల్యే మాధవి పాల్గొన్నారు.

ఎస్పీతో ఏపీఐడీసీ చైర్మన్ మర్యాదపూర్వక భేటీ



ఎస్పీకి పుష్పగుచ్ఛం అందజేస్తున్న దేగల ప్రభాకర్

గుంటూరు, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): గుంటూరు జిల్లాలో నేర నియంత్రణకు కృషి చేయాలని ఆంధ్రప్రదేశ్ ఇండస్ట్రియల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ డేగల ప్రభాకర్ ఎస్పీ వకుల్ జిందాల్‌ను కోరారు. ఇటీవల ఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన వకుల్ జిందాల్‌ను శనివారం ఆయన మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్ప గుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. గుంటూరు నగరంతో పాటు జిల్లాలో వివిధ రకాల సమస్యలపై ఎస్పీతో చర్చించినట్లు చెప్పారు. జిల్లాలో శాంతిభద్రతలు, గంజాయి నిర్మూలించే విధంగా చర్యలు చేపట్టాలని ఎస్పీని కోరినట్లు డేగల ప్రభాకర్ తెలిపారు.

అధికారులు కేటాయించిన విధులను బాధ్యతగా నిర్వహించాలి

● కమిషనర్ పులి శ్రీనివాసులు

గుంటూరుకార్పొరేషన్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): తమకు కేటాయించిన విధులను అధికారులు, సిబ్బంది బాధ్యతగా నిర్వహించాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు అన్నారు. శనివారం ఆయన గుండారావుపేటలో పారిశుధ్య పనులు, చెక్కల బజార్‌లో ఆక్రమణలను పరిశీలించి, తీసుకోవాల్సిన చర్యలపై సంబంధిత అధికారులకు తగు సూచనలు చేశారు. అనంతరం మాట్లాడుతూ, నగర ప్రజలకు మెరుగైన పారిశుధ్యం అందించేందుకు ప్రత్యేక దృష్టి సారించామని చెప్పారు. గుండారావుపేట, జీటి రోడ్లో డ్రైన్ల అపరిశుభ్రతపై స్థానిక ప్రజారోగ్య అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కాల్వలను మధ్యాహ్న సమయంలో శుభ్రం చేయాలని, కాల్వల్లో టీ కప్పులు, వ్యర్థాలు వేసే షాప్‌లను సీజ్ చేసి భారీ మొత్తంలో అపరాధ రుసుం విధించాలని ఆదేశించారు. స్థానిక ప్రజలతో మాట్లాడుతూ, ప్రతి రోజూ ఇంటి వద్దకు వచ్చే ప్రజారోగ్య కార్మికులకే చెత్త ఇవ్వాలని, రోడ్ల మీద, కాల్వల్లో వేయవద్దని సూచించారు. చెక్కల బజార్ ఆక్రమణలను తక్షణం తొలగించాలని, ఆక్రమణల తొలగింపు అనంతరం నూరుశాతం పూడిక తీయించాలని అధికారులను ఆదేశించారు. ఆక్రమణలు పునరావృతం కాకుండా పట్టణ ప్రణాళిక అధికారులు, కార్యదర్శులు పర్యవేక్షణ చేయాలని సూచించారు. కమిషనర్‌తో పట్టణ ప్రణాళిక, ఇంజనీరింగ్, ప్రజారోగ్య అధికారులు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.



దాత కామరాజు ప్రమీలను సత్కరిస్తున్న సుందరాచారి, మాధవి

జీఎంసీలో పెథాలజీ లెక్చర్ గ్యాలరీ హాల్ ప్రారంభం

గుంటూరు మెడికల్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): గుంటూరు మెడికల్ కళాశాల (జీఎంసీ)ను దేశంలోని అత్యుత్తమ వైద్య విద్యాసంస్థలలో ఒకటిగా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్‌వీ సుందరాచారి తెలిపారు. శనివారం కళాశాలలో ఆధునీకరించిన పెథాలజీ విభాగంలోని లెక్చర్ గ్యాలరీ హాల్, కమ్యూనిటీ మెడిసిన్ విభాగంలోని ఆధునిక ప్రయోగశాలను దాత కామరాజు ప్రమీల ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ సుందరాచారి మాట్లాడుతూ, కళాశాల అభివృద్ధికి దాతలు అందించే ప్రతి రూపాయిని సద్వినియోగం చేసి దాతల నమ్మకాన్ని నిలబెట్టడం తమ బాధ్యతని పేర్కొన్నారు. కమ్యూనిటీ మెడిసిన్ విభాగాధిపతి డాక్టర్ సీతారామ మాట్లాడుతూ, డాక్టర్ సుందరాచారి ఆధ్వర్యంలో పూర్వ విద్యార్థులు, దాతలు ముందుకొచ్చి కళాశాల అభివృద్ధికి చేయూతనందిస్తుండటం ఆనందదాయకమని అన్నారు. కార్యక్రమంలో ప్రమీల కుటుంబసభ్యులు డాక్టర్ కామరాజు సుశీలకుమార్, డాక్టర్ అభిరామ్, డాక్టర్ అనిల్‌తో పాటు వైస్ ప్రిన్సిపాళ్లు డాక్టర్ మాధవి (అకడమిక్), డాక్టర్ శ్రీధర్ (అడ్మినిస్ట్రేషన్) తదితరులు పాల్గొన్నారు. కాగా, మణిపాల్ విశ్వవిద్యాలయం గుంటూరు కళాశాలకు 420 హిస్టాలజీ స్లైడ్లను అందజేసింది. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ సుందరాచారి మాట్లాడుతూ, వైద్య విద్యలో దృశ్య ఆధారిత బోధన అత్యంత ప్రాధాన్యం కలిగిందన్నారు. విద్యార్థులు ప్రాక్టికల్ స్థాయిలో శరీర నిర్మాణాన్ని అర్థం చేసుకునేలా సదుపాయాలు మెరుగుపర్చడం తమ లక్ష్యమన్నారు. మానవ శరీర నిర్మాణాన్ని సులభంగా, స్పష్టంగా అర్థం చేసుకోవడానికి ఇవి అమూల్యమైన వనరులని పేర్కొన్నారు.

బాధితులను పరామర్శించిన 'బోడె'

గుంటూరు(తూర్పు), అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): నెల్లూరు జిల్లా గుడ్లూరు మండలం రాళ్లపాడులో జరిగిన ఘటన ఆ ప్రజాస్వామికమని బీసీవై పార్టీ అధినేత బోడె రామచంద్రయాదవ్ అన్నారు. ఈ ఘటనలో గాయపడి గుంటూరులోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను ఆయన శనివారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఘటనలో మృతి చెందిన బాధిత కుటుంబానికి రెండు లక్షల రూపాయిల ఆర్థిక సాయాన్ని ప్రకటించారు.

చిరంజీవి.. ప్రాణదాన స్ఫూర్తివి..!

● అవయవదానంతో 8 మందికి జీవం పోసిన సాయికిరణ్

● ప్రాణం విడిచినా.. చిర కాలం జీవించే అవకాశం

● అవయవదానం పై ప్రజల్లో పెరుగుతున్న ఆసక్తి



సాయి కిరణ్ పార్థీవ దేహానికి వైద్య బృందం నివాళి(ఫైల్)

గుంటూరు, అక్టోబరు18 (ఆంధ్రజ్యోతి): మరణం మనిషి జీవితానికి ముగింపు అని అనుకుంటారు. మరణించిన తర్వాత కూడా జీవించే మార్గం అవయవ దానం. దీనిపై అనేక మందిలో అవగాహన పెరుగుతోంది. తనను తాను చిరంజీవిలా మార్చుకోవాలన్న కాంక్ష కనిపిస్తోంది. వందలాది మంది అవయవ దానం వైపు అడుగులు వేస్తున్నారు.

అవయవ దానానికి చట్టబద్ధత

భారత ప్రభుత్వం 1994లో 'ట్రాన్స్ ప్లాంటేషన్ ఆఫ్ హ్యూమన్ ఆర్గన్స్ అండ్ టిష్యూస్ యాక్ట్' ద్వారా అవయవ దానం చట్టబద్ధత చేసింది. జీవించి ఉన్నవారు తమ అవయవాలను దానం చేయాలనే సంకల్పం తెలుపుతూ ముందుగానే నమోదు చేసుకోవచ్చు. మరణానంతరం దానం చేయాలంటే కుటుంబ సభ్యుల సమ్మతి అవసరం. ప్రతి మెడికల్ కాలేజ్, జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో అందుకోసం ప్రత్యేక వ్యవస్థ ఏర్పాటు చేశారు. ముందు గానే సమ్మతి తెలియజేయడంతో పాటు.. మరణించిన తర్వాత సమాచారం ఆయా ఆసుపత్రికి చేరవేయడం ఇందులో కీలకమని డాక్టర్స్ చెబుతున్నారు.

అవగాహనా కార్యక్రమాలు

ఇటీవల గుంటూరు, విజయవాడ, హైదరాబాద్‌లో అవయవ దానంపై అవగాహన కార్యక్రమాలు పెరుగుతున్నాయి. అధికంగా యువత ఈ ఉద్యమంలో పాల్గొంటోంది. "జీవితం ఒకసారి వస్తుంది... కానీ మన అవయవాలు మరికొంత మందికి కొత్త జీవితం ఇవ్వగలవు" అనే సందేశం వేగంగా వ్యాప్తి చెందుతోంది.

అవయవదానం ఉద్యమ స్థాయికి చేరాలి



రాష్ట్రంలో అవయవదానం ఉద్యమ స్థాయికి చేరాలని, ఇందుకోసం ప్రజల్లో తగినంత అవగాహన పెంచాలని గుంటూరు ప్రభుత్వ సమగ్రాస్పత్రి సూపరింటెండెంట్, ఏపీ శరీర, అవయవదాతల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ రమణ యశస్వి పేర్కొన్నారు. ఒక వ్యక్తి మరణిస్తే అవయవదానం ద్వారా ఎనిమిది మంది జీవితాల్లో కొత్త వెలుగులు ప్రసాదించవచ్చని ఆయన వివరించారు. గుండె, కాలేయం, మూత్రపిండాలు, కళ్లు వంటి అవయవాల కోసం ఎదురు చూస్తున్న వేలాది మంది బాధితులు జీవన్‌దాన్ ట్రస్ట్‌లో తమ పేర్లు నమోదు చేసుకున్నట్లు ఆయన తెలిపారు.

దానం చేయగలిగే శరీర భాగాలు

1. గుండె
2. కాలేయం
3. మూత్రపిండాలు
4. ఊపిరితిత్తులు
5. కంటి కార్నియా

మరణించినా.. వెలుగుల నింపిన ఆశా కిరణం



గుంటూరు జిల్లా మంగళగిరి యువకుడు సాయి కిరణ్ (26) ప్రమా దంలో తీవ్రంగా గాయపడి.. బ్రెయిన్‌డెడ్ అయ్యింది. అతని కుటుంబం పెద్ద మనసుతో అవయవ దానం చేసేందుకు ముందు కొచ్చింది. ఈ నిర్ణయం ఎనిమిది మందికి కొత్త జీవం పోసింది. సాయి కిరణ్ గుండెను హైదరాబాదు ఆసు పత్రిలో ఉన్న ఒక రోగికి విజయ వంతంగా మార్చిడి చేశారు. కాలేయం చెన్నైకి, ఒక మూత్రపిండం విజయవాడకు, మరొకటి విశాఖకు తరలించారు. కంటి కార్నియా, ఊపిరితిత్తులు ఇతర ఆసుపత్రులకు పంపించారు. ఇలా దేశం లోని ఆయా రాష్ట్రాలకు చెందిన ఎనిమిదిమందికి సాయి కిరణ్ అవయవాలను అమర్చారు. ఇప్పుడు సాయి కిరణ్ వారందరి లోనూ జీవించే ఉన్నాడు.

కొత్తగా పల్లె పాలన! క్లస్టర్ వ్యవస్థకు స్వస్తి

గ్రేడులుగా గ్రామ పంచాయతీల విభజన

సత్తెనపల్లి, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): కొత్త సంస్కరణలతో పల్లె పాలన మారనుంది. గ్రామ పంచాయతీల సర్వతోముఖాభివృద్ధికి తీసుకు వస్తున్న నూతన విధానానికి రాష్ట్ర మంత్రి వర్గం మూడు రోజుల కింద ఆమోదం తెలిపింది. ప్రజలకు చేరువగా పాలన ఉండటంతో పాటు కేంద్ర ప్రభుత్వం నుంచి అధిక మొత్తంలో నిధులు రాబట్టేలా చర్యలు తీసుకుంది. ఈ క్రమంలో క్లస్టర్ వ్యవస్థకు మంగళం పలికింది. గ్రేడుల వ్యవస్థకు శ్రీకారం చుట్టింది. పట్టణ సమీపంలో ఉండే పంచాయతీలను రూరల్, అర్బన్ పంచాయతీలుగా ప్రత్యేక గ్రేడు ఇస్తున్నారు. వీటిలో పది వేల జనాభా, కోటి పైన ఆదాయం ఉండాలి. ఈ పంచాయతీల్లో గ్రామ కార్యదర్శుల స్థానంలో ఈవోపీఆర్‌డీలు నియమితులు కానున్నారు. మునిసిపాలిటీల్లో ఏ విధమైన పాలన ఉంటుందో ఇక్కడ అదే తరహా పాలన కొనసాగుతుంది. మిగిలిన పంచాయతీలను మూడు వేలకు పైగా జనాభా ఉన్న వాటిని గ్రేడు -1గా, మూడు వేలు జనాభా ఉన్న వాటిని గ్రేడు-2, రెండు వేల లోపు జనాభా ఉన్న పంచాయతీలను గ్రేడు-3గా విభజించారు. ఇలా గ్రామ పంచాయతీ వ్యవస్థను ప్రక్షాళన చేసే దిశగా ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. మరో వైపు సచివాలయ వ్యవస్థను హేతుబద్ధీకరిస్తున్నారు. గ్రామ పంచాయతీ కార్యదర్శులు ఇక నుంచి పంచాయతీ డెవలప్‌మెంట్ అధికారులుగా వ్యవహరిస్తారు. పల్లెల అభివృద్ధిలో వీరి పాత్ర కీలకం చేశారు. ప్రతి పంచాయతీకి ఒక డెవలప్‌మెంట్ అధికారి ఉండేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది. పల్నాడు జిల్లాలో 529 వరకు పంచాయతీలు ఉన్నాయి.

23 నుంచి విద్యార్థుల ఆధార్ నవీకరణ

పాఠశాలల్లో ప్రత్యేక శిబిరాలు



సత్తెనపల్లి, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): ఆధార్ వివరాల మార్పులు, నవీకరణ కోసం ఈ నెల 23 నుంచి 30వ తేదీ వరకు ఎనిమిది రోజుల పాటు ప్రభుత్వ పాఠశాలల్లో ఆధార్ ప్రత్యేక శిబిరాలు నిర్వ హించనున్నారు. తప్పనిసరి బయోమెట్రిక్ అప్డేట్ పెండింగ్ ఉన్న వారి కోసం వీటిని ఏర్పాటు చేస్తు న్నారు. ఇందుకు సంబంధించి గ్రామ, వార్డు సచివా లయాల శాఖ డైరెక్టర్ ఎం.శివ ప్రసాదు ఉత్తర్వులు జారీ చేశారు. పాఠశాలల్లో వసతి, నెట్ సౌకర్యం, విద్యుత్, ప్రింటర్ సదుపాయాలు కల్పించాలని విద్యాశాఖ అధికారులకు సూచించారు. ప్రభుత్వ పథకాలకు, పోటీ పరీక్షలకు హాజరయ్యే వారికి ఆధార్ నవీకరణ తప్పనిసరి. పిల్లలు పెరుగుతున్న కొద్దీ వారి వేలిముద్రలు, ఇతర బయోమెట్రిక్ లక్షణా లు మారే అవకాశం ఉన్నందున ఈ వివరాల కచ్చిత త్వాన్ని, విశ్వసనీయతను కాపాడుకోవడానికి కేంద్రం ఆధార్ నవీకరణ తప్పనిసరి చేసింది. ఆధార్ తీసుకు న్న తర్వాత ఐదేళ్లు నిండిన పిల్లలు మొదటి సారి, 15 ఏళ్లు నిండిన బాలలు రెండవసారి బయోమెట్రిక్ అప్డేట్ చేసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.


వ్యత్యాసం ఎందుకు?

● ఖమ్మం నుంచి బిహార్ వెళ్లే మిర్చి లారీలు ఇక్కడివే..

● అలాంటప్పుడు కిరాయిలో రూ.30 వేల వ్యత్యాసం ఎందుకు?

● బ్రోకర్లు, యూనియన్ నాయకుల కుమ్మక్కుపై అనుమానాలు

గుంటూరు, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రంలోని ఖమ్మం వ్యవసాయ మార్కెట్, ఇక్కడి గుంటూరు మిర్చియార్డు నుంచి బిహార్‌లో మిర్చి ఎగుమతి అయ్యే ప్రాంతాలకు దూరం ఇంచుమించు సమానం. అయినప్పటికీ అక్కడి నుంచి లారీ కిరాయి ఇక్కడి కంటే రూ. 30 వేలు తక్కువగా ఉంటుంది. ఇదే ప్రధాన కారణంగా



గుంటూరు మిర్చియార్డు

బయ్యర్లు చూపుతూ అక్కడికి వెళ్లి మిర్చి కొనుగోలు చేస్తున్నారని ఎగుమతి వ్యాపారులు చెబుతున్నారు. గుంటూరు మిర్చి బిజినెస్ అక్కడికి క్రమక్రమంగా తరలిపోతుండటానికి కూడా ఇదే మూలమని పేర్కొంటున్నారు. అక్కడి నుంచి లారీలు కిరాయికి పెట్టేది ఇక్కడి లారీ బ్రోకర్లే కావడం అందరిని ఆశ్చర్యానికి గురి చేస్తోంది. అక్కడ తక్కువ కిరాయికి లారీలు పెడుతూ ఇక్కడ ఎందుకు ఎక్కువ డిమాండ్ చేస్తున్నారనేదే అంతుచిక్కకుండా ఉంది.

లారీ యూనియన్‌లో సీరియల్ పాటిస్తున్నామని చెబుతున్నారు.. అయితే ఎక్కువ సంఖ్యలో లారీలున్న వాళ్లకి నెలలో మూడు ట్రిప్పులు పడుతుంటే సింగిల్ లారీ ఉన్న యజమానులకు నెలకో, 40 రోజులకో ఒక ట్రిప్ కిరాయి దొరుకుతుంది. ఖమ్మం ఏఎంసీ నుంచి ఇక్కడి లారీలు పెట్టడం వల్ల గుంటూరులో లారీలు దొరకడం లేదు. అప్పుడు అదనపు కిరాయిని డిమాండ్ చేస్తూ బయటి నుంచి లారీలను పిలిపిస్తున్నారని ట్రేడర్లు ఆరోపిస్తున్నారు. ఖమ్మం ఏఎంసీలో లోడింగ్ చార్జీలు, కమీషన్ తక్కువగా ఉండటం వల్ల ట్రిప్‌కి రూ. 5 వేల వరకు మిగులుతుందని లారీ యజమానులు ఆశపడుతున్నారు. ఇక్కడ లోడింగ్ ఖర్చు రూ. 8 వేలు, దానికి బ్రోకర్ అదనంగా రూ. 4 వేలు పెంచి రూ. 12 వేలు వసూలు చేస్తున్నారు. దీని వల్ల బ్రోకర్‌కి అదనంగా మరో రూ. 4 వేలు మిగులుతుంది. ఇదంతా లారీ యజమాని వద్ద వసూలు చేసేదే. దీంతో ఎక్కువ కిరాయిని యజమానులు కోరుతున్నారు.

రాజధానిలో బాపట్ల ఇంజనీరింగ్ విద్యార్థులు



అసెంబ్లీ భవన పునాదులను తిలకిస్తున్న బాపట్ల ఇంజనీరింగ్ విద్యార్థులు

తుళ్లూరు, అక్టోబరు18(ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతిలోని కొండమరాజుపాలెం రాయపూడి రెవెన్యూలో నిర్మితమవుతున్న గవర్నమెంట్ కాంప్లెక్స్ నిర్మాణ పనులను బాపట్ల ఇంజనీరింగ్ విద్యార్థులు 50 మంది శనివారం సందర్శించారు. షోపూర్జీ పల్లోంజీ, ఎల్ అండ్ టీ, ఎన్‌సీసీ సంస్థలు శాశ్వత సచివాలయం, అసెంబ్లీ, హెచ్‌ఓడీ, హైకోర్టు భవనాలను నిర్మించేందుకు టెండర్లు దక్కించుకున్న విషయం తెలిసిందే. గత టీడీపీ ప్రభుత్వంలో ఈ బిల్డింగ్‌ల నిర్మాణ కోసం పటిష్టమైన పునాదులు వేశారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో వాటిని నీటిలో నానబెట్టారు. అయినా అవి చెక్కు చెదరలేదని మద్రాసు, హైద్రాబాద్ ఐఐటీలు పరిశీలించి నివేదికలు ఇచ్చాయి. కూటమి ప్రభుత్వంలో ఆయా పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. పనులను బాపట్ల ఇంజనీరింగ్ విద్యార్థులు ఆసక్తిగా తిలకించారు. ఇటీవలే రాజధాని అమరావతిలో సీఆర్డీఏ ప్రాజెక్టు కార్యాలయం సీఎం చంద్రబాబు నాయుడి చేతుల మీదగా ప్రారంభమైంది. జీ ప్లస్ 7 అంతస్థులతో నిర్మాణం చేసి అందుబాటులోకి వచ్చిన తొలి శాశ్వత ప్రభుత్వ కార్యాలయం ఇదే. దీనిని చూడటానికి కూడా సందర్శకులు వస్తున్నారు. ఆంక్షలు ఉండడం వల్ల అందరూ సందర్శించడానికి అనుమతులుండడం లేదు. ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ టవర్లు, ఉద్యోగుల ఇళ్ల టవర్లను బాపట్ల ఇంజనీరింగ్ విద్యార్థులు సందర్శించి సెల్ఫీలు తీసుకున్నారు.

162 మందికి వైద్య సాయం



వైద్య పరీక్షలు చేయించుకొంటున్న ఉద్యోగులు

గుంటూరు, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): రైల్వే శాఖ ప్రతి శనివారం నిర్వహిస్తున్న హెల్త్ ఆన్ వీల్స్ మొబైల్ ట్రైన్ క్యాంపులో ఈ వారం 162 మంది వైద్యసాయం పొందారు. నడికుడి మార్గంలో ఈ క్యాంపుని రైల్వే శాఖ నిర్వహించింది. ఈ సందర్భంగా 157 మందికి ర్యాండమ్ బ్లడ్ షుగర్, బీపీ పరీక్షలు చేశారు. వీరిలో 13 మందికి అసలు డయాబెటీస్/బీపీ ఉన్నట్లే తెలియలేదు. ఆయా రోగులకు విషయాన్ని తెలియజేసి మందులు ఇచ్చారు. క్రమం తప్పకుండా ఇకపై వైద్యసాయం తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా సీనియర్ డీఎంవో డాక్టర్ వీబీ మహర్షి మాట్లాడుతూ కార్డియాక్ పరీక్షల నుంచి క్యాన్సర్ స్క్రీనింగ్ వరకు అన్ని రకాల వైద్య సేవలు అందిస్తున్నామన్నారు.

పునరుత్పాదక శక్తి పరికరాలపై... జీఎస్‌టీ తగ్గింపు కొత్త శకానికి నాంది

● ఐవీఆర్ఎస్ సర్వేలో జిల్లాకు ప్రథమ స్థానం: కలెక్టర్ అన్సారియా



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ అన్సారియా, వేదికపై ఎమ్మెల్యే రామాంజనేయులు, కమిషనర్ తదితరులు

గుంటూరు, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): పునరుత్పాదక శక్తి పరికరాలపై జీఎస్‌టీ తగ్గింపు కొత్త శకానికి నాంది పలుకుతుందని కలెక్టర్ తమీమ్ అన్సారియా పేర్కొన్నారు. సూపర్ జీఎస్‌టీ- సూపర్ సేవింగ్స్ కార్యక్రమంలో భాగంగా నెడ్ క్యాప్ ఆధ్వర్యంలో నిర్వహించిన ర్యాలీని కలెక్టర్, నెడ్ క్యాప్ వీసీ, ఎండీ కమలాకరబాబు, కమిషనర్ పులి శ్రీనివాసులు ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జీఎస్‌టీ కౌన్సిల్ జీఎస్‌టీ 2.0 సంస్కరణల ద్వారా వివిధ రంగాలకు చెందిన వస్తువులపై తగ్గించిన పన్నుల శాతంపై దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్ర వ్యాప్తంగా ప్రజలకు అవగాహన కోసం విస్తృత స్థాయిలో కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. అవగాహన కార్యక్రమంపై రాష్ట్రస్థాయిలో నిర్వహించిన ఐవీఆర్ఎస్ సర్వేలో జిల్లా ప్రథమ స్థానంలో నిలిచిందని తెలిపారు. కుసుమ పథకం ద్వారా వ్యవసాయ మోటార్లకు సోలార్ ప్యానల్స్ ఏర్పాటు చేసుకునేవారికి మరింత ఎక్కువగా నగదు పొదుపు చేసుకునే అవకాశం ఉంటుందన్నారు. ఎమ్మెల్యేలు బూర్ల రామాంజనేయులు, నసీర్ అహ్మద్ మాట్లాడుతూ సూపర్ జీఎస్‌టీ 2.0 సంస్కరణలతో ప్రతి కుటుంబానికి ఏడాదికి రూ. లక్ష నుంచి రూ. లక్షన్నర వరకు పొదుపు అవుతుందన్నారు. డీసీఎమ్ఎస్ ఛైర్మన్ వడ్రాణం హరిబాబునాయుడు, డీఆర్వో ఖాజావలి, నెడ్‌క్యాప్ జిల్లా మేనేజర్ కృష్ణారెడ్డి, జిల్లా ఉద్యానశాఖ అధికారి రవీంద్రబాబు, ఆర్‌డీవో శ్రీనివాసులు, తహసీల్దారు వెంకటేశ్వర్లు తదితరులున్నారు.

దీపం-2 మూడో విడత రాయితీ ఎప్పుడో!

● 80 రోజులు అయినా బ్యాంకు ఖాతాల్లో జమ కాని పరిస్థితి

● పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదు చేస్తున్న లబ్ధిదారులు



గుంటూరు, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): దీపం-2 మూడో విడత వంట గ్యాస్ వంద శాతం సబ్సిడీ లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో జమ కావడం లేదు. ఆగస్టు నెల ఒకటో తేదీ నుంచి బుకింగ్స్, డెలివరీలు ప్రారంభమైనప్పటికీ ఇప్పటి వరకు చాలా మందికి నగదు జమ కాలేదు. దీంతో ఏదైనా సాంకేతిక సమస్య తలెత్తిందేమోనని చాలా మంది పీజీఆర్ఎస్‌కు ఆన్‌లైన్/ఆఫ్‌లైన్‌లో ఫిర్యాదు చేస్తున్నారు. అలానే రెండు, మూడో విడతల నుంచి తాము ఏమైనా అనర్హులమయ్యామానని వాకబు చేస్తున్నారు. నిత్యం వందల మంది పౌర సరఫరాల అధికారుల వద్దకు వెళ్లి వంట గ్యాస్ సబ్సిడీ గురించి ఆరా తీస్తున్నారు. ప్రభుత్వమే ఇంకా రాయితీ బడ్జెట్ విడుదల చేయలేదని అధికారులు చెప్పి పంపిస్తున్నారు.

గత ఏడాది దీపావళి పండగ సందర్భంగా సూపర్ సిక్స్ హామీల అమలులో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం దీపం-2 పథకాన్ని ప్రారంభించింది. తొలి విడత ఈ సంవత్సరం మార్చి వరకు అమలు చేసింది. రెండో విడతని ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి జూలై నెలాఖరు వరకు, మూడో విడతని ఆగస్టు ఒకటో తేదీ నుంచి అమలు చేస్తోంది. అయితే రెండో విడతలోనే ఇంకా చాలామందికి దీపం-2 రాయితీ నగదు జమ కాలేదు. మూడో విడతకు సంబంధించి బాపట్ల జిల్లాలో ఇప్పటి వరకు 2,48,484 వంటగ్యాస్ రీఫిల్ బుకింగ్స్, డెలివరీలు జరిగాయి. అయితే వీళ్లలో 60,854 మందికే రాయితీ విడుదల జరిగింది. గుంటూరు జిల్లాలో 3,52,110 రీఫిల్ డెలివరీలు జరగగా 84,822 మందికి రాయితీ విడుదలైందని పౌరసరఫరాల శాఖ అధికారులు చెబుతున్నారు. పల్నాడు జిల్లాలో 3,41,692 డెలివరీలకు 76,405 మందికి సబ్సిడీ విడుదలైందని తెలిపారు.

పైన పేర్కొన్న గణాంకాలను పరిగణనలోకి తీసుకొంటే సబ్సిడీ విడుదల 20 నుంచి 25 శాతం మధ్యనే ఉంది. ఈ దీపావళి పండగకు అందరికి రాయితీ విడుదల జరుగుతుందని లబ్ధిదారులు భావించారు. అయితే ఏ కారణం చేతనో ఇంకా బడ్జెట్ విడుదల కాలేదని అధికారులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో తక్షణమే రెండో విడతలో పెండింగ్, మూడో విడత రీఫిల్ డెలివరీలకు సంబంధించిన సబ్సిడీని విడుదల చేయాలని లబ్ధిదారులు కోరుతున్నారు. పౌరసరఫరాల శాఖకు సంబంధించి పీజీఆర్ఎస్‌లో వస్తున్న ఫిర్యాదుల్లో ఎక్కువగా దీపం-2కు సంబంధించినవే ఉంటున్నాయి. వాటిని క్లోజ్ చేయడానికి సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ జిల్లా నుంచే ప్రాతినిధ్యం వహిస్తున్నందున రాబోయే క్యాబినేట్ సమావేశంలో ఈ అంశాన్ని ప్రస్తావించి.. బడ్జెట్ విడుదల చేయించాలని లబ్ధిదారులు కోరుతున్నారు.

కాలుష్య రహిత దీపావళిని జరుపుకుందాం : కలెక్టర్



పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ అన్సారియా

గుంటూరు(తూర్పు), అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): వాయు, శబ్ద కాలుష్య రహిత దీపావళిని జరుపుకుందామని జిల్లా ప్రజలను కలెక్టర్ తమీమ్ అన్సారియా కోరారు. కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో దీపావళిపై రూపొందించిన పోస్టర్‌ను కలెక్టర్ కార్యాలయంలో ఉన్నతాధికారులతో కలసి ఆమె ఆవిష్కరించారు. కలెక్టర్ మాట్లాడుతూ దీపాలను వెలిగించడం మన సంస్కృతిలో భాగమన్నారు. కాలుష్యానికి కారణమయ్యే టపాసుల జోలికి వెళ్లొద్దని సూచించారు. హరిత టపాసులకు ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. పర్యావరణ ఇంజనీరు ఎండీ నజీనా బేగం మాట్లాడుతూ రసాయనాల ఆధారిత టపాసులతో వాయు, ధ్వని కాలుష్యాన్ని పెంచుతాయన్నారు. అంతేగాక పర్యావరణంతో పాటు ఆరోగ్యం దెబ్బతింటుందని తెలిపారు. దీనిని దృష్టిలో పెట్టుకుని గ్రీన్ క్రాకర్స్‌ను వినియోగించాలని కోరారు. కలెక్టర్ ఆవిష్కరించిన ఈ పోస్టర్లను అన్ని విద్యాసంస్థల్లో, ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రదర్శిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జీజీహెచ్ సూపరింటెండెంట్ రమణ యశస్వీ, డీఎంహెచ్‌వో కే.విజయలక్ష్మి, జిల్లా ఆసుపత్రుల సమన్వయ అధికారి బీవీ రంగారావు తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ బాలిక మృతి

తుళ్లూరు, అక్టోబరు 18:(ఆంధ్రజ్యోతి) ఎలుకల మందు తిని బాలిక మృతి చెందింది. తుళ్లూరు పోలీసుల వివరాల మేరకు.. అచ్చంపేటకు చెందిన రామయ్యకు ముగ్గురు పిల్లలు, కుమారుడు ఉన్నాడు. మంగళగిరి మండలం కురగల్లులో ఉంటూ ఎస్ఆర్ఎం యూనివర్శిటీలో అంట్లు కడుగుతూ జీవనం సాగిస్తున్నారు. ఇటీవల అచ్చం పేట వెళ్లిన సమయంలో అప్పులు వాళ్లు బాలిక కోటేశ్వరి ముందే రామయ్య మీదకు వచ్చారు. దీంతో మనస్తాపం చెందిన బాలిక ఈ నెల 14న తుళ్లూరు పెదనాన్న ఇంటికి వచ్చిన సమయంలో ఎలుకల మందు తినింది. అనంతరం కురగల్లు ఇంటికి చేకున్నారు. సాయంత్రం తీవ్ర అస్వస్థతకు గురైన కోటేశ్వరిని హాస్పటల్‌లో చేర్చారు. చికిత్సపొందుతూ శనివారం మరణించింది. ఎస్సై బాబురావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వ్యభిచార గృహాలపై టాస్క్‌ఫోర్స్ దాడి

● పోలీసుల అదుపులో పలువురు నిర్వాహకులు, విటులు

గుంటూరు అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశాల మేరకు ఎస్‌బీ సీఐ ఆళమరి శ్రీనివాస్ పర్యవేక్షణలో టాస్క్ ఫోర్స్ బృందాలు శనివారం జిల్లా వ్యాప్తంగా వ్యభిచార గృహాలపై దాడులు నిర్వహించారు. బ్రాడీపేట 3/12వ లైన్ లోని లోని ఒక ఇంటిలో వ్యభిచారం నిర్వహిస్తున్న ముడావత్ పద్మ, ముడావత్ గోపి నాయక్, మరో ముగ్గురు మహిళలను అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు. అలాగే నగరంపాలెం పోలీస్ స్టేషన్ పరిధిలోని శ్రీనివాసరావుతోట 7వ లైనుకు చెందిన ఆషా వ్యభిచార గృహంపై దాడి చేశారు. మంగళదాస్ నగర్‌కు చెందిన మురికిపూడి కోటేశ్వరరావు, విజయవాడకు చెందిన మరో మహిళను అదుపులోకి తీసుకుని రెస్క్యూ హోం తరలించారు. పాత గుంటూరు పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఒక భవనంలో పేకాట ఆడుతున్న వారిపై దాడి నిర్వహించి పది మంది జూదరులను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి 10 సెల్ ఫోన్లను, రూ.25,500 నగదు, నాలుగు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు.

భావితరాలకు స్వచ్ఛమైన వాతావరణం: జడ్పీ సీఈవో



మొక్క నాటుతున్న సీఈఓ

గుంటూరు (తూర్పు), అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): భావితరాలకు స్వచ్ఛమైన వాతావరణాన్ని అందించాలంటే ఇప్పటి నుంచే పర్యావరణ హిత కార్యక్రమాలను చేపట్టాలని జడ్పీ సీఈవో జ్యోతిబసు అన్నారు. వెంగళాయపాలెంలో గ్రామ సర్పంచ్ నల్లపాటి లలితకుమారి ఆధ్వర్యంలో స్వర్ణ ఆంధ్ర-స్వచ్ఛ ఆంధ్రా కార్యక్రమంలో భాగంగా స్వచ్ఛగాలి అనే అంశంపై గ్రామ సభ నిర్వహించారు. తొలుత గ్రామంలో సైకిల్ ర్యాలీ, ప్రతిజ్ఞ, మొక్కలు నాటడం వంటి కార్యక్రమా లను జరిపారు. డీపీవో నాగసాయి కుమార్ పరిశ్రమలు, మోటార్ వాహ నాల నుంచి విడుదలయ్యే గాలి కలుషితంపై అవగాహన కల్పించారు. అనంతరం ప్రకృతిలో జీవ సమతుల్యత, చెట్లు, నీటి చెరువుల ఆవశ్యకత గురించి సీఆర్‌డీఏ హార్టికల్చర్, ప్లాంటేషన్ అడిషనల్ కమిషనర్ శివప్రసాద్ వివరించారు. ఎంపీడీవో బండి శ్రీనివాస రావు, డిప్యూటీ ఎంపీడీవో కె.శ్రీనివాస్, ప్రత్తిపాడు, పంచాయితీరాజ్ ఇంజనీరింగ్ విభాగం డీఈఈ భాను ప్రకాష్, గ్రామ ప్రజలు, సిబ్బంది పాల్గొన్నారు.

గుంటూరు రూరల్ వార్తలు

◆ మంగళగిరి ◆ తాడికొండ ◆ ప్రత్తిపాడు

సంక్షేమం, అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

● ఎమ్మెల్యే శ్రావణ్‌కుమార్

తాడికొండ, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా కూటమి పని చేస్తుందని ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్ పేర్కొన్నారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలోని గ్రామ సచివాలయం, రైతు సేవాకేంద్రం, పీ-4 కార్యాలయాన్ని ప్రారంభించారు. అంతేకాకుండా పీ-4లో భాగంగా బంగారు కుటుంబాలకు ఎంపికైన వారికి మెకానికటూల్ కిట్స్‌ను అందజేశారు. దివ్యాంగులకు వీల్ చైర్లు, చేతికర్రలు, బెల్టులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా శ్రావణ్ కుమార్ మాట్లాడుతూ కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత ఎన్నికల హమీలో భాగంగా సూపర్ సిక్స్ పథకాలను అమలు చేసి చూపించిందన్నారు. జీఎస్టీ తగ్గించి పేద, మధ్య తరగతి ప్రజలకు పన్నుల భారాన్ని తగ్గించిందన్నారు. కార్యక్రమంలో బీజేపీ నియోజకవర్గం ఇన్‌ఛార్జ్ కంతేటి బ్రహ్మయ్య, జనసేన పార్టీ ఇన్‌ఛార్జ్ బేతపూడి రాజశేఖర్, టీడీపీ మండల అధ్యక్షులు తలశిల ప్రసన్నకుమార్, ధనేకుల సుబ్బారావు, ఏపీ ఖాదీ విలేజ్ ఇండస్ట్రీస్ డెవలప్‌మెంట్ సభ్యులు పాల్గొన్నారు.



పీ-4లో బంగారు కుటుంబాలకు మెకానిక్ పరికరాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే శ్రావణ్‌కుమార్

స్వచ్ఛాంధ్రతో స్వర్ణాంధ్ర సాధించాలి

ఫిరంగిపురం, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): స్వచ్ఛాంధ్ర కార్యక్రమం ద్వారా స్వర్ణాంధ్ర సాకారమవుతుందని ఎమ్మెల్యే శ్రావణ్‌కుమార్ అన్నారు. శనివారం ఫిరంగిపురంలో స్వచ్ఛాంధ్ర స్వర్ణాంధ్ర కార్యక్రమ సభలో ఆయన మాట్లాడారు. ప్రజల ఆరోగ్యమే పరమావధిగా భావించి రాష్ట్ర ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని ప్రతి నెల 3వ శనివారం చేస్తున్నారన్నారు. గత ప్రభుత్వం చెత్త మీద పన్ను వేయగా దానిని కూటమి రద్దు చేసిందన్నారు. పంచాయతీల బలోపేతానికి ఆనాడు నారా లోకేశ్ ఎల్ఈడీ బల్బులు వేయించారని ఆయన గుర్తు చేశారు. సంపద సృష్టించే కేంద్రాలను అధికారులు బాగా పని చేసే విధంగా చూడాలన్నారు. వ్యక్తిగత, పరిసరాల శుభ్రత, నీటి కాలుష్యం, ప్లాస్టిక్ నిర్మూలన, నీరు నిల్వకుండా చేయటం బాలలకు చిన్నప్పటి నుంచే నేర్పాలన్నారు. ప్రకృతిని, పర్యావరణాన్ని కాపాడు కోవటానికి ప్రతి ఒక్కరు మొక్కలు నాటాలన్నారు. మండలంలో తాగునీటి సమస్యలు లేకుండా చేయనున్నామన్నారు. ఎంపీడీవో శివ సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ రాష్ట్రంలో పారదర్శకపాలన జరుగుతుందన్నారు. ముందుగా గ్రామంలో స్వయంగా వీధులను ఎమ్మెల్యే శ్రావణ్‌కుమార్ ఊడ్చారు. అలాగే సెయింట్ ఆన్స్ బాలికోన్నత పాఠశాలలో మొక్కలను నాటారు. విద్యార్థినిలతో ప్రతిజ్ఞ చేయిం చారు. బస్టాండ్ నుంచి పంచాయతీ కార్యాల యం వరకు సైకిల్ ర్యాలీ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ కే ప్రసాదరావు, కొత్తపల్లి కోటేశ్వరరావు, మండవ నరసింహారావు, కంతేటి బ్రహ్మయ్య, బీ జ్యోతి, ఆరె పున్నారెడ్డి, నల్లజర్ల అప్పయ్య, పీ హృదయ రాజు, ఏపీఎం నాగేశ్వరరావు, బందనాథం సతీష్, కటికల రామకోటేశ్వరరావు, సయ్యద్ రబ్బానీ, ఈవో తదితరులు పాల్గొన్నారు.

బహిరంగ ప్రకటన

మా క్లయింట్ శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్, మంగళగిరి బ్రాంచ్ వారి సూచనలు పొంది యిందుమూలముగా యావన్మందికి తెలియచేయునది ఏమనగా... **షేక్ భాసింవలి** గారి భార్య **షేక్ షాహిదా** గారి ఆస్తిని తనఖా పెట్టుకొని ఋణము పొందుటకు సంప్రదించినారు. కావున ఈ దిగువ షెడ్యూలు ఆస్తికి సంబంధించి ఎవరికైనా అభ్యంతరములు, క్లయిములు ఉన్నచో 7 రోజులలోపు తెలియ చేయవలయును. ఎట్టి అభ్యంతరములు, క్లయిములు రానిచో మా క్లయింట్ సదరు **షేక్ షాహిదా** గారికి ఋణం మంజూరు చేయును. **షెడ్యూలు** : గుంటూరు జిల్లా, పెదకాకాని సబ్.డి. యిలాకా పెదకాకాని మండలం, పెదకాకాని గ్రామ పంచాయితీ ఏరియాలో చేరిన పెదకాకాని గ్రామం శాలూకు డి.నెం. 503రు బాపతు య. 5.97 సెంట్లు మిం౦జమలే పెదకాకాని గ్రామ డోరు నెం. 2-124రు సమీపమున మాకు హక్కు కలిగిన య. 0.25 సెంట్లులో, ఈ రోజున మీకు విక్రయించి, స్వాధీనపరచిన చ.గ. 193.6లు స్థిరాస్తి ఖాళీ నివేశన స్థలమునకు హద్దులు **తూర్పు** : మేదా వెంకటాస్ కృష్ణ వుర్ఫ్ వెంకటకృష్ణ గారి స్థలము హద్దు, **దక్షిణం** : అ.14లు వెడల్పు గల పంచాయితీ బజారు హద్దు, **పడమర** : ఈ రోజున మేము మేదా వెంకటాస్ కృష్ణ వుర్ఫ్ వెంకటకృష్ణ గారికి విక్రయించిన స్థలము హద్దు, **ఉత్తరం** : అ.16లు వెడల్పు గల పంచాయితీ బజారు హద్దు, ఈ హద్దుల మధ్య చ.గ. 193.6లు లేక చ.మీ. 161.86ర్లు స్థిరాస్తి ఖాళీ నివేశన స్థలమున్నా. DOC NO : 12031/2024, S.R.O. మంగళగిరి.

లంకా విజయ్‌కుమార్, లంకా వంశీక్రిష్ణ,
న్యాయవాదులు, 2వ లైను, రవీంద్ర నగర్, గుంటూరు.
సెల్ నెం.9030595227, 9848052914

బహిరంగ ప్రకటన

మా క్లయింట్ శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్, గుంటూరు-2 బ్రాంచ్ వారి సూచనలు పొంది యిందుమూలముగా యావన్మందికి తెలియచేయునది ఏమనగా... **షేక్ మస్తాన్ సాహెబ్** గారి కుమారుడు **షేక్ ఆదామ్ సాహెబ్** అలియాస్ **షేక్ ఆదామ్** గారి ఆస్తిని తనఖా పెట్టుకొని ఋణము పొందుటకు సంప్రదించినారు. కావున ఈ దిగువ షెడ్యూలు ఆస్తికి సంబంధించి ఎవరికైనా అభ్యంతరములు, క్లయిములు ఉన్నచో 7 రోజులలోపు తెలియ చేయవలయును. ఎట్టి అభ్యంతరములు, క్లయిములు రానిచో మా క్లయింట్ సదరు **షేక్ ఆదామ్ సాహెబ్** అలియాస్ **షేక్ ఆదామ్** గారికి ఋణం మంజూరు చేయును. **షెడ్యూలు** : గుంటూరు జిల్లా, నరసరావుపేట రి.డి. క్రోసూరు సబ్.డి.లోని క్రోసూరు గ్రామ పంచాయితీకి చెందిన క్రోసూరు గ్రామమందు నా పూర్వార్జితమై నేటి వరకు నా స్వాధీన హక్కు భుక్తములలో యున్న క్రోసూరు గ్రామ డి.నెం. 604/1సి రులో య. 4.81ట్లు లో మీకు విక్రయించిన భూమికి హద్దులు : **తూర్పు** : షేక్ సిరిపురం సుభాని, **దక్షిణం** : ఆర్ అండ్ బీ రోడ్డు, **పడమర** : షేక్ కూరపాటి మస్తాన్ సాహెబ్, **ఉత్తరం** : వాగు పోరంబోకు. యీ హద్దుల మధ్య య.2-00ట్లు లేక 0.809 హెక్టార్లు గల శేటి మెరక భూమి. DOC NO : 1272/2011, S.R.O. క్రోసూరు.

లంకా విజయ్‌కుమార్, లంకా వంశీక్రిష్ణ,
న్యాయవాదులు, 2వ లైను, రవీంద్ర నగర్, గుంటూరు.
సెల్ నెం.9030595227, 9848052914

మొక్కుబడిగా సర్వసభ్య సమావేశం

- నామమాత్రంగా అధికారుల, ప్రజాప్రతినిధుల హాజరు
- ప్రజాసమస్యలపై గళమెత్తే నాయకుడు కరువు
- ఇలా అయితే సమస్యల పరిష్కారం ఎలా..?

పెదనందిపాడు, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): మూడు నెలలకు ఒకసారి ఎంతో ప్రతిష్ఠాత్మకంగా జరగాల్సిన మండల సర్వసభ్య సమావేశం మండలంలో మొక్కుబడిగా జరుగుతుంది. కూటమి అధికారంలోకి వచ్చి రెండేళ్లవుతున్నా గత ప్రభుత్వ హయాంలో జరిగినట్లే సమావేశాలు తూతూమంత్రంగా జరుగుతున్నాయి. దీంతో ప్రజాసమస్యలను పరిష్కరించిన దాఖలాలు కూడా కనిపించడం లేదంటూ ప్రజలు చర్చించుకుంటున్నారు. శనివారం పెదనందిపాడులోని ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ తమలపాకుల హెప్సీబా అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ఎంపీటీసీలు, సర్పంచులు, ఆయా శాఖల అధికారులు ఉదయం 11గంటలకు హాజరుకావాల్సి ఉండగా మధ్యాహ్నం 12 గంటలకు అరకొరగా హాజరయ్యారు. గత సమావేశంలో చర్చించిన పలు సమస్యలకు పరిష్కారం చూపినట్లు ప్రస్తావించలేదు. సమావేశం కోరం కోసం పంచాయతీరాజ్ అధికారులు నానా అవస్థలు పడ్డారు. 13 మంది ప్రజాప్రతినిధులు హాజరుకావాల్సి ఉండగా ఆరుగురు మాత్రమే వచ్చారు. గైర్హాజరైన ఎంపీటీసీలకు ఫోన్ చేసి మీరు రాకపోతే ఎలా కచ్చితంగా రండి, సంతకం పెట్టి పోండి అని బతిమిలాడి మరీ సర్వసభ్య సమావేశాలకు పిలుస్తున్నట్లు సమాచారం. మండల వ్యాప్తంగా పలు గ్రామాల్లో అనేక సమస్యలు ఉండగా ప్రజాప్రతినిధులతో పాటు అధికారులూ గైర్హాజరవడంతో సమస్యలు ఎలా పరిష్కారమవుతాయని ప్రజలు బహిరంగంగా విమర్శలు చేస్తున్నారు. కొందరు అధికారులకు సమావేశం నిర్వహిస్తున్నట్లు కనీసం సమాచారం లేదని కేవలం వాట్సాప్‌లో సమాచారం పంపుతున్నారని తెలిసింది.



ఖాళీగా దర్శనమిస్తున్న కుర్చీలు

గేటు దాటని అవగాహనా ర్యాలీ

- మమ అనిపిస్తున్న అధికారులు
- ప్రభుత్వ లక్ష్యానికి తూట్లు

పెదనందిపాడు, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): గ్రామాలను స్వచ్ఛ గ్రామాలుగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో ప్రతినెలా మూడవ శనివారం స్వచ్ఛ ఆంధ్ర, స్వర్ణ ఆంధ్ర కార్యక్రమానికి రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. రాష్ట్ర, జిల్లా స్థాయిల్లో నాయకులు, అధికారులు పెద్దఎత్తున అవగాహనా ర్యాలీలు చేపట్టి ప్రజల్లో చైతన్యం తెచ్చేలా కార్యక్రమాలు నిర్వహిస్తుండగా, క్షేత్రస్థాయిలో అధికారుల తీరుతో ఈ కార్యక్రమం నీరుగారుతోంది. మండల కేంద్రం పెదనందిపాడు పంచాయతీ కార్యాలయం వద్ద శనివారం అధికారులు ఫ్లెక్సీ పట్టుకొని కార్యాలయం నుంచి రెండడుగులు వేసి ఫోటోలు తీసుకున్నారు. వాటిని వాట్సాప్ గ్రూపుల్లో అప్‌లోడ్ చేసుకొని మమ అనిపించి వెళ్లిపోయారు. అన్ని గ్రామాల్లో ఇదే తంతు కొనసాగుతోంది. ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపమే దీనికి కారణమని ప్రజలు బహిరంగంగా విమర్శలు చేస్తున్నారు.

మాకు న్యాయం చేయండి మహాప్రభో..!

పెదనందిపాడు, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): స్థానిక పాతబస్టాండ్ సెంటర్లో అంబేడ్కర్ విగ్రహం వద్ద ఎన్నో ఏళ్లుగా నెట్టుడు బండ్లు పెట్టుకుని వ్యాపారాలు చేసుకుంటున్న వ్యాపారులను ఆ స్థలాల్లో వ్యాపార సముదాయాలు తొలగించాలంటూ పంచాయతీ, పోలీసుశాఖ అధికారులు నోటీసులు జారీ చేశారు. దాంతో తాము జీవనోపాధిని కోల్పోతామని, తమకు న్యాయం చేయాలని కోరుతూ డీటీ షేక్ కరిముల్లా, ఎంపీడీవో స్వామిరెడ్డికి శనివారం వీధి వ్యాపారులు వినతిపత్రాలు అందజేశారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో నూర్‌జహాన్, షేక్ బాజీ, నాగూర్‌బీ, కుమారి, జాన్‌బీ, ఇబ్రహీం తదితరులు ఉన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



తాడేపల్లిలో సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేస్తున్న వల్లభనేని వెంకట్రావు తదితరులు

తాడేపల్లిటౌన్, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): తాడేపల్లిలో ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన చెక్కులను టీడీపీ నాయకులు స్వయంగా బాధితురాలి ఇంటికి వెళ్లి శనివారం పంపిణీ చేశారు. 12వ వార్డుకు చెందిన షేక్ ఉర్‌మహీరాకు మంజూరైన రూ.54,258, 19వ వార్డులో సువ్వడి చిన్నమ్మకు మంజూరైన రూ.42,450, ఉయ్యూరు మహాలక్ష్మికి మంజూరైన రూ.55 వేల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను టీడీపీ నేతలు అందజేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ టీడీపీ అధ్యక్షుడు వల్లభనేని వెంకట్రావు, నేతలు ఓలేటి రాము, ఇట్టా భాస్కర్, షేక్ చాంద్‌బాష, సంజీవరెడ్డి, సైకం సాంబయ్య, దర్శి హరికృష్ణ, తాడిబోయిన గోపి, కొర్రపాటి విజయ్, బాజి, పద్మ, ఊర్మిళ, నిర్మల, రమణారెడ్డి, సుధాకర్, శ్రీను, ఇలియాజ్ బాబావలి, నరసింహ, సీహెచ్ రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

● మంగళగిరి : మంగళగిరిలో వీవర్స్ కాలనీకి చెందిన గోపిరెడ్డి తిరుమలరెడ్డికి రూ.2,30,000లు, బాప్టిస్ట్ పేటకు చెందిన గోలి వాణికి రూ.60,707లు, ఎర్నీనగర్‌కు చెందిన కుసుం రాముకు రూ.40వేలు, సూర్యనారాయణ నగర్‌కు చెందిన పట్టెం లక్ష్మికి రూ.25,541, షరాఫ్‌బజార్‌కు చెందిన చెన్నా శ్యామలకు రూ.40,350, టిప్పర్లబజార్‌కు చెందిన దాసరి స్పందనకు రూ.38,795 విలువైన చెక్కులు అందజేశారు. ఈ కార్యక్రమంలో మంగళగిరి పట్టణ టీడీపీ అధ్యక్షుడు పడవల మహేశ్, కందుల నాగార్జున, షేక్ రియాజ్, కారంపూడి అంకమ్మరావు, కాసిన కొండలరావు, జలభద్ర రమేశ్, సింహాద్రి బేబిరాణి, వడిశా నరేశ్, నాగులాపల్లి వెంకన్న, మల్లేశ్వరరావు, వంగర సధాశివరావు, అక్కల హరి బాబు, బాపనపల్లి రవి, బిట్రా శ్రీనివాసరావు, జొన్నాదుల శంకర్, గోలి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

బహిరంగ ప్రకటన

మా క్లయింట్ శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్, గుంటూరు-2 బ్రాంచ్ వారి సూచనలు పొంది యిందుమూలముగా యావన్మందికి తెలియచేయునది ఏమనగా... **షేక్ అబ్దుల్ కరీం** గారి కుమారుడు **షేక్ ఆదం షఫీ** గారి ఆస్తిని తనఖా పెట్టుకొని ఋణము పొందుటకు సంప్రదించినారు. కావున ఈ దిగువ షెడ్యూలు ఆస్తికి సంబంధించి ఎవరికైనా అభ్యంతరములు, క్లయిములు ఉన్నచో 7 రోజులలోపు తెలియ చేయవలయును. ఎట్టి అభ్యంతరములు, క్లయిములు రానిచో మా క్లయింట్ సదరు **షేక్ ఆదం షఫీ** గారికి ఋణం మంజూరు చేయును. **షెడ్యూలు** : పల్నాడు - డి., నర్సరావుపేట- రిజి., సత్తెనపల్లి - సబ్‌డి. యిలాకా, గుంటూరు జిల్లా, మేడికొండూరు మండలమునకు చెందిన సిరిపురం గ్రామంలో మా సర్వ సంపూర్ణ స్వాధీన హక్కు భుక్తములలో వున్నటువంటి సిరిపురం గ్రామ డి.నెం. 303-బి గుర్తు, రీ సర్వే దాఖలా సిరిపురం గ్రామ ఎల్.పి.నెం. 3058లో య. 46-06 సెంట్లు మింజుమలె టి.నెం. 6-53రు, అ.నెం. 1261రు గల నీకు విక్రయించిన రేకుల షెడ్డుకు హద్దులు : **తూర్పు** : పంచాయితీ బజారు హద్దు. అ.21అం.5లు, **దక్షిణం** : జంపని శ్రీనివాసరావు ఆస్తికి ఈ ఆస్తికి మధ్య గల జాయింటు గోడ హద్దు. అ56లు, **పడమర** : ఆర్ & బి రోడ్డు హద్దు, అ 25లు, **ఉత్తరం** : గోరంట్ల శ్రీనివాస్ స్థలము హద్దు. అ 86లు, ఈ హద్దుల మధ్యస్థమైన చ.గ. 221.75లు (రెండు వందల ఇరవై ఒకటి పాయింటు ఏడు ఐదు చదరపు గజములు) లేక 186.27లు చ.మీ.లు గల ఖాళీ స్థలముస్నూ, సదరు ఖాళీ స్థలములో 15 సం॥ముల క్రితం అ 144లలో నిర్మించిన ఏ.సి.సి. రేకుల షెడ్డున్నూ. DOC NO : 6128/2025, S.R.O. సత్తెనపల్లి.

లంకా విజయ్‌కుమార్, లంకా వంశీక్రిష్ణ,
న్యాయవాదులు, 2వ లైను, రవీంద్ర నగర్, గుంటూరు.
సెల్ నెం.9030595227, 9848052914

వెలుగు ప్రాజెక్టులోని అంశాల అమలుపై సమీక్ష

దుగ్గిరాల, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): సంస్థాగత నిర్మాణంలో ఎక్కడ వెనుకబడి ఉన్నామో గుర్తించి, సమస్యలను అధిగమించాలని డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ టీవీ విజయలక్ష్మి అన్నారు. దుగ్గిరాలలోని మండలపరిషత్ కార్యాలయం ఆవరణలో వెలుగు ప్రాజెక్టుకు సంబంధించి పలు అంశాలపై మండల సమాఖ్య సభ్యులు, అధికారులతో సమీక్ష శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా బ్యాంకు లింకేజీ శ్రీనిధి, ఎస్సీ ఎస్టీ సబ్‌ప్లాన్ ఉన్నతి, వ్యక్తిగత రుణాలు, నాన్‌ఫామ్, పుస్తకాల నిర్వహణ, తదితర అంశాలను చర్చించారు. అడిషనల్ ప్రాజెక్టు డైరెక్టర్ కిరణ్‌కుమార్, డీపీఎం అశోక్ కుమార్, బ్యాంకు లింకేజీ డీపీఎం కేశ్, ఐబీడీపీఎం శివప్రసాదరెడ్డి, శ్రీనిధి ఏజీఎం హర్షవర్ధన్, ఏపీఎం సురేష్‌కుమార్, బ్యాంకు మేనేజర్లు పాల్గొన్నారు.

క్లోరినేషన్ చేసిన నీటినే సరఫరా చేయాలి

● ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రాజేశ్

పెదనందిపాడు, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో తాగు నీటిని తప్పనిసరిగా క్లోరినేషన్ చేసి సరఫరా చేయాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రాజేశ్ ఆదేశించారు. ఆంధ్రజ్యోతిలో శుక్రవారం వెలువడిన చెరువులో నీటికలుషితం మృత్యువాత పడుతున్న చేపలు అనే కథనానికి స్పందిస్తూ శనివారం తాగునీటి చెరువులను ఆయన పరిశీలించారు. తప్పనిసరిగా చెరువుల్లో బ్లీచింగ్ చల్లాలని, గేదెలు దిగకుండా కంచెలు ఏర్పాటు చేయాలని సిబ్బందికి సూచించారు. తాగునీటి వల్ల ప్రజలకు ఎలాంటి అనారోగ్య సమస్యలు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని కార్యదర్శి శ్వేతను ఆదేశించారు.

ఏఎన్‌యూ కబడ్డీ జట్టుకు పీఏఎస్ కళాశాల విద్యార్థిని ఎంపిక



ఎం.త్రివేణి

పెదనందిపాడు, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున యూనివర్సిటీ మహిళా కబడ్డీ జట్టుకు పీఏఎస్ కళాశాలలో బీకాం రెండో సంవత్సరం చదువుతున్న ఎం.త్రివేణి ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ జి.వీరరాఘవయ్య శనివారం తెలిపారు. ఈ నెల 16, 17వ తేదీల్లో గుంటూరు చలపతి ఫార్మసీ కళాశాలలో జరిగిన పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరచి జట్టుకు ఎంపికైనట్లు తెలిపారు. ఎంపికైన విద్యార్థిని త్రివేణిని కళాశాల పాలకవర్గ సభ్యులు కాళహస్తి సత్యనారాయణ (విశ్రాంత ఏఎస్పీ), లావు ఆదిశేషయ్య, నర్రా బాలకృష్ణ, నర్రా వీరయ్య, వ్యాయామ అధ్యాపకులు పాతూరి శ్రీనివాసరావు ప్రత్యేకంగా అభినందించారు.

కిట్స్ కళాశాలలో ముగిసిన వెబ్ కోడింగ్-2025



హ్యాకథాన్‌లో ఎంపికైన విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న ప్రిన్సిపాల్ పి.బాబు తదితరులు

వట్టిచెరుకూరు, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వింజనంపాడు గ్రామ సమీపంలోని కిట్స్ కళాశాలలో సీఎస్ఈ ఏ-1 ఎంఎల్ విభాగం ఆధ్వర్యంలో మూడు రోజులుగా జరుగుతున్న వైబ్ కోడింగ్-2025 కార్యక్రమం శనివారం ముగిసింది. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ కోయ సుబ్బారావు మాట్లాడుతూ కిట్స్ కళాశాల విద్యార్థుల భవిష్యత్తుకు ఇది గొప్ప వేదికగా నిలుస్తుందన్నారు. కళాశాల కార్యదర్శి కోయ శేఖర్ మాట్లాడుతూ, కోడింగ్ నైపుణ్యాలు సాంకేతిక పరిజ్ఞానం మాత్రమే కాకుండా సృజనాత్మక ఆలోచనలు, సమస్య పరిష్కార మార్గాలు నేర్పుతాయన్నారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ డాక్టర్ కే హరిబాబు, ప్రిన్సిపాల్ పీ బాబుల పర్యవేక్షణలో మూడు రోజుల పాటు విద్యార్థులు వ్యక్తిగతంగా జట్ల వారీగా కోడింగ్ పోటీలు హాకథాన్, ప్రాజెక్టు ప్రదర్శనలో పాల్గొన్నారు.

వధూవరులకు పెళ్లికానుక అందజేత



పెళ్లికానుకను అందిస్తున్న వడ్డేశ్వరం టీడీపీ నేతలు

తాడేపల్లి, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): తాడేపల్లి మండలం వడ్డేశ్వరం రాధారంగానగర్‌కు చెందిన కూనపరెడ్డి దామోదర్‌రావు, గాయత్రీదేవీల వివాహ మహోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్ర మంత్రి నారా లోకేశ్ పంపిన పెళ్లికానుకను శుక్రవారం రాత్రి గ్రామ టీడీపీ ఆధ్వర్యంలో వడ్డేశ్వరం నేతలు వధూవరులకు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకుడు కాట్రగడ్డ మధుసూదనరావు, గ్రామ అధ్యక్షుడు ఈపూరి కోటయ్య, మద్దినేని సుబ్రహ్మణ్యం, పామినేని త్రినాథ్, కాట్రగడ్డ లక్ష్మి, కాట్రగడ్డ రాధ, షేక్ ఇమాంసా, నాగూర్‌వలి, నాగేశ్వ రరావు, తంబిబాబు, పుట్టా దామోదర్, లక్ష్మణరావు, వెంకన్న, రాకేష్, జోసఫ్, వివేక్, హరి తదితరులు పాల్గొన్నారు.

పశ్చిమడెల్టాకు 6522 క్యూసెక్కులనీరు

దుగ్గిరాల, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): ప్రకాశం బ్యారేజి నుంచి పశ్చిమడెల్టాకు 6522 క్యూసెక్కులనీరు శనివారం విడుదల చేస్తున్నట్లు నీటి పారుదలశాఖ అధికారులు తెలిపారు. ప్రస్తుతం బ్యారేజి వద్ద 12.0 అడుగుల నీటిమట్టం ఉండగా దిగువకు 36,250 క్యూసెక్కులనీరు విడుదల చేస్తున్నారు. దుగ్గిరాల సబ్‌డివిజన్ నుంచి హైలెవెల్‌ఛానల్‌కు 296 క్యూసెక్కులు, రేపల్లెకాల్వకు 1631 క్యూసెక్కులు, తూర్పుకాల్వకు 563 క్యూసెక్కులు, పశ్చిమకాల్వకు 200 క్యూసెక్కులు, నిజాంపట్నంకాల్వకు 401 క్యూసెక్కులు, కొమ్మమూరు కాల్వకు 2740 క్యూసెక్కుల నీరు, విడుదల చేస్తున్నారు.





















వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు

తుళ్లూరు, (ఐనవోలు) అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): వ్యక్తి అదృశ్యంపై తుళ్లూరు పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. ఐనవోలుకు చెందిన నందూరు నాగమల్లేశ్వరావు ఈ నెల 13న అదృశ్యం అయ్యాడు. కుమారుడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

స్వచ్ఛాంధ్ర.. స్వర్ణాంధ్ర..స్వచ్ఛ్‌దివస్‌పై అవగాహన



ఈమనిలో ర్యాలీ నిర్వహిస్తున్న ఎంపీపీ జబీన్, అధికారులు, నాయకులు

తాడేపల్లి టౌన్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): తాడేపల్లి మున్సిపల్ కార్యాలయం వద్ద ఉండవల్లి సెంటర్‌లోని పార్క్‌లో శనివారం స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని స్వచ్ఛాంధ్ర ఎండీ అనిల్ కుమార్‌రెడ్డి మొక్కలు నాటి ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులు కార్యకర్తలు మున్సిపల్ కార్యాలయం నుంచి సైకిల్ ర్యాలీ నిర్వహించారు. అనిల్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ ప్లాస్టిక్ నిషేధించి పర్యావరణాన్ని కాపాడాలని, మొక్కలు నాటి కాలుష్యాన్ని అరికట్టాలని అన్నారు. శబ్ద కాలుష్యం, వాయు కాలుష్యం లేకుండా దీప కాంతులతో దీపావళిని జరుపుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జనసేన నేత జొన్నా రాజేశ్, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ డైరెక్టర్ ఆరుద్ర భూలక్ష్మి, ఎంటీఎంసీ కమిషనర్ ఎస్ అలీం బాష, డిప్యూటీ కమిషనర్ శ్రీకాంత్, ఏడీ రామారావు, అడిషనల్ కమిషనర్ శకుంతల, టీడీపీ నాయకులు వల్లభనేని వెంకట్రావు, జనసేన నాయకులు తిరుపతిరావు, జొన్నా రాజేశ్, దినేశ్, స్థానిక నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

● దుగ్గిరాల, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి):. మండలంలోని దుగ్గిరాల, ఈమనిగ్రామాల్లో స్వచ్ఛాంధ్ర..స్వర్ణాంధ్ర.. కార్యక్రమంలో భాగంగా ప్రజలకు అవగాహన కల్పిస్తూ శనివారం ర్యాలీలు నిర్వహించారు. గ్రామకూడళ్లలో ప్రజలు, అధికారులతో కలిసి ప్రతిజ్ఞ చేశారు. ఈమనిలో నిర్వహించిన ర్యాలీలో ఎంపీపీ షేక్ జబీన్, వైస్‌ఎంపీపీ పసుపులేటి సాయిచైతన్య, సర్పంచ్ సిద్దెల శ్రీవాణీఉజ్వల హరిణి, పలువురు నాయకులు పాల్గొన్నారు. దుగ్గిరాలలో కొత్తలాకు వద్దగల పార్కులోని పిచ్చిమొక్కలు తొలగించి శుభ్రం చేసే కార్యక్రమంలో దోస్త్ అధ్యక్షుడు మిక్కిలినేని గాంధీ, మాజీఎంపీపీ వెనిగళ్ల శ్రీకృష్ణప్రసాద్ తదితరులు పాల్గొన్నారు

బాణసంచా విక్రయాలకు అనుమతి తప్పనిసరి

● తహసీల్దార్ రాఘవరావు

మేడికొండూరు అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): మేడికొండూరు మండలంలోని వివిధ గ్రామాల్లో బాణసంచా విక్రయదారులు తప్పనిసరిగా ముందస్తు అనుమతులు తీసుకోవాలని మేడికొండూరు తహసీల్దార్ రాఘవరావు శనివారం తెలిపారు. దీపావళి సందర్భంగా బాణాసంచా విక్రయదారులు అనుమతి పొందిన ప్రాంతాల్లోనే తాత్కాలిక దుకాణాలను ఏర్పాటు చేసుకోవాలని కోరారు. రాత్రి 10 గంటల తర్వాత బాణసంచా కాల్చకూడదని హెచ్చరించారు. బాణసంచా స్టాళ్ల ఏర్పాటు చేయాలనుకునే వ్యాపారులు స్థానిక పోలీస్ స్టేషన్‌నుంచి, అగ్నిమాపక శాఖల నుంచి ఎన్‌వోసీ పొందిన తర్వాత తహసీల్దార్ కార్యాలయం ద్వారా రెవెన్యూ డివిజనల్ అధికారి నుంచి అనుమతి పొందాలని అన్నారు.

కంటిచూపుపై జాగ్రత్త వహించాలి

● మంగళగిరి ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కె.సురేశ్‌బాబు

మంగళగిరి, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): కంటిచూపు, కంటి విషయాలపై ప్రతి ఒక్కరూ జాగ్రత్త వహించాలని మంగళగిరి ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కె.సురేశ్‌బాబు అన్నారు. శనివారం మంగళగిరి బార్ అసోసియేషన్‌లో పెదకాకాని శంకర కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో న్యాయ వాదులు, కోర్టు సిబ్బంది, పోలీసుల కోసం నిర్వహించిన ఉచిత కంటి వైద్యశిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. కంటిచూపు పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని నిత్యం, కంటి పరీక్షలు, చేయించుకుంటూ ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ కార్యదర్శి కురగంటి రమేశ్, డాక్టర్ శివాని, పి.కాశీప్రసాద్, సిబ్బంది, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది, పోలీసులు పాల్గొన్నారు.

సుప్రీంకోర్టు సీజేపై దాడి అప్రజాస్వామికం

దుగ్గిరాల, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): సుప్రీంకోర్టు ప్రధానన్యాయమూర్తి బీఆర్ గవాయ్‌పై అప్రజాస్వామికమని, భారత ప్రజాస్వామ్య లౌకిక రాజ్యాంగ పరిరక్షణ సమితి అధ్యక్షుడు షేక్ సుభాని అన్నారు. స్థానిక ముర్తుజానగర్‌లో జరిగిన మీడియా సమావేశంలో పాల్గొన్న సుభాని మాట్లాడుతూ ప్రజాస్వామ్యంపైన, న్యాయవ్యవస్థపైన దాడిగా భావిస్తున్నామని, బాధ్యులైన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని అన్నారు.













అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలి

● ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు



మాట్లాడుతున్న బూర్ల రామాంజనేయులు

గుంటూరు(తూర్పు), అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు సూచించారు. స్థానిక విద్యానగర్, క్యాంపు కార్యాలయంలో శనివారం 41, 40, 26, 27 డివిజన్‌ల నాయకులు, ప్రజాప్రతినిధులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ చేపట్టిన కార్యక్రమాల్లో విధిగా నాయకులు పాల్గొనాలని ఆదేశించారు. డివిజన్‌లో జరిగే పనులపై నిత్యం పర్యవేక్షించాలన్నారు. డివిజన్ పరిధిలో ఎన్ని నిధులు కేటాయించారు.. ఏ మేర పనులు జరిగాయి అనే అంశంపై స్థానిక అధికారులతో సమీక్షలు నిర్వహించాలన్నారు. ప్రతిపక్ష పార్టీ నాయకులు చేసే విమర్శలను సమర్థవంతంగా తిప్పికొట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు, కార్పొరేటర్లు, కూటమి శ్రేణులు పాల్గొన్నారు.

30శాతం మధ్యంతర భృతి కల్పించాలి

ప్రత్తిపాడు, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): 12వ పీఆర్సీ కమిషన్‌ను నియమించి 30 శాతం మధ్యంత భృతిని ఇవ్వాలని ఏపీటీఎఫ్ గుంటూరు జిల్లా అధ్యక్షుడు కె.బసవలింగారావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రత్తిపాడు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఏపీటీఎఫ్ ప్రత్తిపాడు జోన్ సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం వెంటనే 12వ పీఆర్సీ కమీషన్‌ను నియమించాలన్నారు. అంతే కాకుండా నాలుగు నెలల డీఏలు పెండింగ్‌లో ఉన్నాయని, వెంటనే రెండు డీఏలను విడుదల చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షురాలు పి.పార్వతి, ఎన్.రాంబాబు, సీహెచ్ వెంకటేశ్వరరెడ్డి, మరియరాజు, వి.వందనం, నాగరాజు, రాజ్యలక్ష్మి, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

సులభతర విద్యాబోధన

కాకుమాను, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో క్లస్టర్ సమావేశం శనివారం హెచ్ఎం భాస్కర్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఎంఈవో కెన్నడీ ఉపాధ్యాయులకు సులభతర విద్యాబోధనపై అవగాహన సదస్సులో వెనుకబడిన విద్యార్థులపై ఉపాధ్యాయులు శ్రద్ధ తీసుకోవాలన్నారు. సీ, డీ గ్రేడ్‌ల విద్యార్థులకు వినూత్న రీతిలో బోధన చేస్తూ ఫలితాలపై దృష్టి సారించాలన్నారు.











పారిశుధ్యాన్ని పరిశీలించిన మలేరియా అధికారి చంద్రశేఖర్

ఫిరంగిపురం, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలో శనివారం ఫ్రైడే, డ్రైడేలో భాగంగా పారిశుధ్య కార్యక్రమాలను సత్తెనపల్లి మలేరియా సబ్ యూనిట్ అధికారి చంద్రశేఖర్ పరిశీలించారు. రేపూడి ఆరోగ్య ఉప కేంద్రంలో ఆషా కార్యకర్తల పీడీపీ రికార్డులు, మలేరియా రికార్డులను ఆయన తనిఖీ చేశారు. అనంతరం రేపూడి గ్రామంలో వాడుకొనే నీటి తొట్లను, సిమెంట్ గాబులను, నీటి పీపాల్లో నిల్వ ఉన్న నీటిని దోమలు గుడ్లు పెట్టకుండా పారబోయించారు. గాబులకు వస్త్రాలుగా మూతలుగా పెట్టుకోవాలని ఆయన కోరారు. అలాగే మురుగు కాలువల్లో దోమల లార్వాను ఎబేట్ ద్రావణాన్ని వేసి చంపించారు. కార్యక్రమంలో మలేరియా హెల్త్ అసిస్టెంట్ జె.బాబూరావు, ఏఎన్ఎం లలిత కుమారి, ఎంఎల్‌హెచ్ పి.సువర్ణ, ఆషా కార్యకర్తలు పాల్గొన్నారు.













తెనాలి వార్తలు

◆ తెనాలి ◆ పొన్నూరు

జిల్లాస్థాయిలో నారాకోడూరు బాలికల ప్రతిభ

చేబ్రోలు, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): నారాకోడూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థినులు జిల్లాస్థాయిలో ప్రతిభ కనబరిచారు. ఈ నెల 11న గుంటూరులో హెల్త్ అండ్ మెడికల్ శాఖ ఆధ్వర్యంలో జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా నిర్వహించిన పోటీలలో ఈ విద్యార్థినులు ప్రతిభాపాటవం ప్రదర్శించారు. 9వ తరగతి విద్యార్థిని ఎం.భావన సేవ్ గర్ల్ చైల్డ్ అనే అంశంపై వ్యాసరచన పోటీలలో ద్వితీయ స్థానం సాధించి రూ.3000 బహుమతి, ప్రశంసాపత్రాన్ని పొందింది. అదే పాఠశాల 9వ తరగతి విద్యార్థిని కే బిందుతేజ చిత్రలేఖనంలో తృతీయ స్థానం సాధించి రూ.2000 నగదు బహుమతి, ప్రశంసాపత్రాన్ని కలెక్టర్ ఎ.తమీమ్ అన్సారియా నుంచి స్వీకరించారు. ఈ సందర్భంగా హెచ్ఎం ఎం.ఏడుకొండలు ఉపాధ్యాయులు పి.రాజ్యలక్ష్మి, ఎం.జగదీష్‌కుమార్, కమిటీ చైర్మన్ వెలగ గోపీనాథ్ వారిని అభినందించారు.



మున్నంగిలో శ్మశాన వాటికకు స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు

శ్మశానవాటికకు స్థలాల పరిశీలన

కొల్లిపర, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): ఇటీవల మంత్రి నాదెండ్ల మనోహర్ మండలంలోని పిడపర్రు, తూములూరు, దంతలూరు, మున్నంగి గ్రామాల్లో పర్యటించగా గ్రామాల్లో శ్మశానవాటికకు స్థలాలు లేకపోవడంతో అనేక ఇబ్బందులకు గురవుతున్నామని స్థానికులు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. దీంతో మంత్రి నాదెండ్ల మనోహర్ ఆదేశాల మేరకు శనివారం ఆయా గ్రామాల్లో తహసీల్దార్ సిద్ధార్థ, ఓఎస్‌డీ ఏసురత్నం పర్యటించి స్థలాలను పరిశీలించారు. సంబంధిత రైతులతో మాట్లాడారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ శ్మశాన వాటిక స్థలాల కోసం పిడపర్రులో ఎకరం భూమిని, తూములూరులో 30 సెంట్లు, దంతలూరులో 75సెంట్లు, మున్నంగిలో 75 సెంట్ల భూమిని పరిశీలించినట్లు తెలిపారు. వివరాలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకు వెళ్ళనున్నట్లు తెలియజేశారు.

దీపావళి రోజున పిల్లలను కనిపెట్టుకుని ఉండాలి



తహసీల్దార్ సిద్ధార్థ

కొల్లిపర, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): దీపావళి రోజున తల్లిదండ్రులు తమ పిల్లల పట్ల తగిన జాగ్రత్తగా ఉండాలని తహసీల్దార్ సిద్ధార్థ అన్నారు. శనివారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పిల్లలు క్రాకర్స్ కాల్చేటప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకోవడం మంచిదన్నారు. క్రాకర్స్ దుకాణాలు ఏర్పాటుచేసేవారు ప్రభుత్వ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలన్నారు. క్రాకర్స్ దుకాణాలమధ్య దూరం తప్పనిసరిగా ఉండాలన్నారు. తాత్కాలిక క్రాకర్స్ దుకాణాలను అమోదించిన ప్రదేశాలల్లో మాత్రమే ఏర్పాటు చేయాలన్నారు. క్రాకర్స్ దుకాణాల సమీపంలో ధూమపానాన్ని నిషేధించడం జరిగిందన్నారు. క్రాకర్స్ దుకాణాల దగ్గర నోస్మోకింగ్ బోర్డును తప్పనిసరిగా ఏర్పాటు చేయాలన్నారు. సమావేశంలో డిప్యూటీ తహసీల్దార్ రాజేష్, ఆర్ఐ వంశీకృష్ణ పాల్గొన్నారు.

బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులు ప్రతి నెలా వైద్యపరీక్షలు చేయించుకోవాలి

● మండల వైద్యాధికారి నీహ



వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న మండల వైద్యాధికారి నీహ

కొల్లిపర, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులు ప్రతి నెల వైద్యపరీక్షలు చేయించు కోవాలని మండల వైద్యాధికారి నీహ అన్నారు. శనివారం మండల పరిధిలోని మున్నంగిలో వైద్యాధికారులు ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్ క్యాంపును నిర్వహించారు. వైద్యాధికారులు రోగులకు వైద్యపరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేసి తగిన సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ సందర్భంగా నీహ మాట్లాడుతూ మెడికల్ క్యాంపుల ద్వారా దీర్ఘకాలిక రోగాలను గుర్తించవచ్చునన్నారు. ఎఫ్‌పీసీ క్యాంపులో మంచంలో ఉన్న వారికి కూడా ఇంటికి వెళ్ళి వైద్యసదుపాయం కల్పించనున్నట్లు తెలియజేశారు. కార్యక్రమంలో ఏఎన్ఎం రాజ్యం, డీఈవో బొమ్ము కోటిరెడ్డి, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

మత్తులో నడిరోడ్డుపై యువకుడు హల్‌చల్



రోడ్డుపై హల్‌చల్ చేస్తున్న యువకుడు

తెనాలి అర్బన్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): మత్తులో ఉన్న యువకుడు రోడ్డుపై హల్‌చల్ చేయడంతో ఆ మార్గంలో ప్రయాణించేవారు బెంబేలెత్తిపోయారు. రూరల్ మండలం అంగలకుదురులో ఓ యువకుడు మద్యం, గంజాయి, మత్తు బిళ్లల్లో ఏది తీసుకున్నాడో తెలియదు.. రోడ్డుపై కూర్చుని కొద్దిసేపు కేకలు వేస్తూ గడిపాడు. మరికొంత సేపు రహదారిపై అటు ఇటు తిరుగుతూ కర్ర తీసుకుని కేకలు వేస్తూ వీరంగం వేశాడు. దీంతో ఆ మార్గంలో పోయే ప్రయాణీకులు ఆందోళనకు గురయ్యారు. మత్తులో ఏ వాహనం కింద పడతాడోనని భయపడుతూ వాహన చోదకులు వాహనాలు నడిపారు. స్థానిక మందులు విక్రయించే దుకాణంలో మత్తు మందు బిళ్లలు, ఇంజక్షన్లు విక్రయిస్తున్నారని స్థానికులు ఆందోళన చేశారు. దీంతో సదరు వ్యాపారస్తుడు దుకాణం మూసి పారిపోయాడని గ్రామస్తులు చెప్పారు.

సాహితీ లోకంలో ధృవతార విశ్వనాథ

తెనాలి అర్బన్, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): సాహితీ లోకంలో ధృవతారగా విశ్వనాథ సత్యనారాయణ వెలుగొందారని ఆధ్యాత్మిక ప్రచారకర్త కూర్మనాథచార్యులు చెప్పారు. చినరావూరులో సంస్కృత కళాశాల పూర్వ విద్యార్థులు శనివారం సత్యనారాయణ వర్ధంతి సందర్భంగా పూలమాలలు వేసి నివాళులర్పించారు. వినాయకరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, వేయి పడగలు, రామాయణ కల్పవృక్షం, కిన్నెరసాని పాటలు వంటి రచనలు చేసిన మహావ్యక్తి అని చెప్పారు. చందస్సును తెలుగుతల్లికి ముక్కెర చేశారని భావపల్లవాలు అనేకం ఉన్నాయని, తెలుగు నుడికారం ఎక్కువగా ఉండేదన్నారు. కవిసామ్రాట్‌గా కీర్తిగడించిన ఆయన రచనలు తెలుగు భాష బతికి ఉన్నంతకాలం ఉంటాయన్నారు. మురళీకృష్ణ, రామలింగేశ్వరరావు, అప్పారావు, కృష్ణకుమారి, లక్ష్మణరావు, శ్రీనివాసమూర్తి, సుశీల, సామ్రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.



సత్యనారాయణ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న పూర్వ విద్యార్థులు

స్వర్ణ ఆంధ్ర - స్వచ్ఛ ఆంధ్రలో ప్రారంభోత్సవాలు.. శంకుస్థాపనలు

పెదకాకాని, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో నిర్వహిస్తున్న స్వర్ణ ఆంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో శనివారం పెదకాకాని మండలం అగతవరప్పాడు గ్రామంలో ముఖ్యఅతిథులుగా ఎమ్మెల్యే నరేంద్ర కుమార్, జనసేన నాయకులు వడ్రాణం మార్కండేయ బాబు పాల్గొన్నారు. ప్రజలకు స్వర్ణ ఆంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం గురించి అవగాహన కల్పించి వారి చేత ప్రతిజ్ఞ చేయించారు. అగతవరప్పాడు గ్రామంలో రూ.20 లక్షల జిల్లా పరిషత్ నిధులతో నిర్మించే జడ్పీ రోడ్డుకు శంకుస్థాపన చేశారు. రూ.35 లక్షల గ్రామ పంచాయతీ నిధులుతో ఎస్టీ కాలనీలో అంతర్గత రోడ్లు, ఏపీఎస్ కాలనీలో అంతర్గత రోడ్లకు శంకుస్థాపన చేశారు. రూ.10 లక్షల ఉపాధి హామీ నిధులతో ఏపీఎస్ కాలనీలో నిర్మించిన సీసీ రోడ్డుకు ప్రారంభోత్సవం చేశారు.

సీఎం సహాయనిధి చెక్కులను పంపిణీ

అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స చేయించుకోవడానికి ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా మంజూరైన 11 చెక్కులను రూ.6,49,278 మొత్తాన్ని ఎమ్మెల్యే నరేంద్ర కుమార్, ఆంధ్రప్రదేశ్ అర్బన్ డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ వడ్రాణం మార్కండేయ బాబు లబ్ధిదారులకు అందజేశారు.



పెదకాకాని - వెనిగండ్ల రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే నరేంద్ర

● పెదకాకాని నుండి వెనిగండ్ల గ్రామం వెళ్లాలంటే ఇబ్బందులు పడుతున్న ప్రజల అవసరాన్ని దృష్టిలో పెట్టుకొని రోడ్డు నిర్మాణానికి శనివారం భూమి పూజ ఎమ్మెల్యే నరేంద్ర కుమార్ చేశారు. రూ.3.50 కోట్లలతో ఈ రోడ్డు నిర్మాణ పనులను చేపట్టనున్నారు. కార్యక్రమంలో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.



మానవహారంలో పాల్గొన్న విద్యార్థులు, పారిశుధ్య సిబ్బంది

ప్రతి ఒక్కరూ పరిశుభ్రత పాటించాలి

తెనాలి అర్బన్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో ప్రతి ఒక్కరూ పరిశుభ్రత పాటించి స్వచ్ఛాంధ్ర, స్వర్ణాంధ్ర కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మున్సిపల్ చైర్ పర్సన్ తాడిబోయిన రాధిక చెప్పారు. పట్టణంలోని బోసురోడ్డులో శనివారం పరిశుభ్రమైన గాలి అనే నినాదంతో ర్యాలీ, మానవహారం కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఈ కార్యక్రమం ప్రతినెలా జరుగుతుందని అందరూ భాగస్వామ్యం వహిస్తే సమాజానికి మేలు కలుగుతుందన్నారు. వ్యాధులకు కారణం అపరిశుభ్రత అని గుర్తించాలని చెప్పారు. శుభ్రత ఉంటే వ్యాధులు దరి చేరవని, తద్వారా ఆరోగ్యవంతమైన సమాజం సాధ్యపడుతుందన్నారు. మున్సిపల్ కమిషనర్ జె.రామఅప్పలనాయుడు, పూర్ణచంద్రరావు, హెల్త్ ఆఫీసర్ యేసుబాబు, అనీల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కార్తీకమాస ఏర్పాట్లపై సిబ్బందితో సమీక్ష

● ఆలయ ఉప కమిషనర్ లీలా కుమార్

పెదకాకాని, అక్టోబర్ 18(ఆంధ్రజ్యోతి): పెదకాకాని శ్రీమల్లేశ్వరస్వామి దేవస్థానంలో కార్తీకమాస ఏర్పాట్లపై అర్చకులు, కార్యాలయ సిబ్బందితో సమీక్షా సమావేశం ఆలయ ఉప కమిషనర్ జి లీలా కుమార్ శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా లీలాకుమార్ మాట్లాడుతూ ఈనెల 22 నుండి నవంబర్ 20వ తేదీ వరకు కార్తీకమాసం సందర్భంగా భక్తులు ఏవిధమైన అసౌకర్యం కలుగకుండా తీసుకోవలసిన ఏర్పాట్లపై చర్చించి తగు సూచనలు చేశారు. భక్తుల పట్ల ఆలయంలో పని చేసే ప్రతి ఒక్కరు మర్యాదగా మెలగాలని, గర్భాలయం నందు అభిషేకాలు, దర్శనాల విషయంలో సిబ్బందికి తగు ఆదేశాలు జారీ చేశామన్నారు. శానిటేషన్ తనిఖీదారులతో ప్రత్యేకంగా ఆలయాన్ని పరిశుభ్రంగా ఉంచాలన్నారు. ఎప్పటికప్పుడు దేవాలయ ప్రాంగణం శానిటేషన్ సిబ్బందితో క్లీనింగ్ చేయించాలని సూచించారు. సేవా టిక్కెట్ కౌంటరు సిబ్బంది, అన్నప్రసాద వితరణ సిబ్బందికి తగు సూచనలుచేశారు. సిబ్బంది అందరి సహకారంతో కార్తీకమాసం విజయవంతంగా పూర్తి చేయాలని ఆలయ ఉపకమిషనరు గోగినేని లీలాకుమార్ తెలిపారు. సమావేశంలో స్థానాచార్యులు పొత్తూరి సాంబశివరావు పాల్గొన్నారు.



ఆలయ సిబ్బంది, అర్చకులతో సమావేశమైన ఆలయ ఉప కమిషనర్ లీలా కుమార్

భావితరాల సంక్షేమం కోసం పర్యావరణాన్ని పరిరక్షించాలి

పొన్నూరు, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): భావితరాల సంక్షేమం కోసం పర్యావరణాన్ని ప్రతి ఒక్కరూ పరిరక్షించాల్సిన బాధ్యత ఉందని మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్, కనీస వేతనాల కమిటీ డైరెక్టర్ ఆకుల సాంబశివరావు అన్నారు. పొన్నూరు పట్టణంలోని పురపాలక సంఘం ఆధ్వర్యంలో శనివారం స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా స్వచ్ఛమైన గాలి ఆరోగ్యకరమైన జీవనం అంశంపై అవగాహన కార్యక్రమాలు జరిగాయి. ఈ సందర్భంగా మున్సిపల్ సిబ్బంది, పట్టణవాసులు భారీ ప్రదర్శన నిర్వహించారు. అనంతరం మనవహారంగా ఏర్పడి పర్యావరణ పరిరక్షణ స్వచ్ఛమైన గాలి అనే అంశాలపై పట్టణవాసులకు అవగాహన కల్పించారు. ప్రధానంగా పలువురు వక్తలు మాట్లాడుతూ అనేక వ్యర్థాలతో వాతావరణం కలుషితమై పోయి ప్రజలు అనారోగ్యం బారిన పడుతున్నారని తెలిపారు. పర్యావరణాన్ని పరిరక్షించాలంటే ప్లాస్టిక్‌ను సంపూర్ణంగా నిషేధించడంతో పాటు హానికరమైన వ్యర్థాలను బహిరంగ ప్రదేశాల్లో విడిచి పెట్టవద్దని సూచించారు. గాలి కాలుష్యం వల్ల ప్రజలు స్వచ్ఛమైన గాలిని పీల్చలేక అనేక రుగ్మతులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం కొనసాగుతున్న పరిస్థితి భవిష్యత్ తరాలకు ఆరోగ్యకరమైన జీవనాన్ని అందించే అవకాశం లేకుండా పోతుందని ఆవేదన చెందారు. ఇప్పటికైనా ప్రతి ఒక్కరు పారిశుధ్యం పై దృష్టి సారించి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటే, మొక్కల పెంపకాన్ని చేపడితే భావితరాలకు స్వచ్ఛమైన గాలిని, నీటిని, భూమిని అందించే అవకాశం ఉంటుందని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ముప్పాళ్ళ రమేష్ బాబు, వివిధ విభాగాల సిబ్బంది, కూటమి పార్టీల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



మానవహారంగా ఏర్పడి పర్యావరణంపై అవగాహన కల్పిస్తున్న మున్సిపల్ సిబ్బంది

మానసిక ఉల్లాసం కలిగించే సంగీత గానం

తెనాలి అర్బన్, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): సంగీత గానం మానసిక ఉల్లాసం కలిగిస్తుందని ప్రముఖ సంగీత విద్వాంసుడు జి.ఆంజనేయశాస్త్రి పేర్కొన్నారు. శనివారం ప్రపంచ గాన దినోత్సవం నిర్వహించారు. బాలికలకు సంగీత సాధనలో శిక్షణ ఇచ్చారు. ప్రతి ఆడపిల్లకు తల్లిదండ్రులు సంగీతం నేర్పించాలని, తద్వారా ఓర్పు, సృజనాత్మకత అలవడుతుందన్నారు.



నందీశ్వరునికి అభిషేకం చేస్తున్న అర్చకులు

సోమేశ్వరాలయంలో నందీశ్వరునికి అభిషేకం

తెనాలి అర్బన్, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): చినరావూరులోని సోమేశ్వరాలయంలో శనివారం నందీశ్వరునికి అభిషేకం చేశారు. శ్రీబాలసుందరి సమేత శ్రీసోమేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేకపూజల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. శనిత్రయోదశి పురస్కరించుకుని శనికి విశేషరీతిలో అభిషేకాలు చేశారు. అమ్మవారికి కుంకుమార్చన, సోమేశ్వరునికి అభిషేకాలు జరిపారు.

వ్యభిచార గృహంపై పోలీసుల దాడి

తెనాలి క్రైం, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): స్థానిక కొత్తపేట కాలారి హాస్పటల్ రోడ్డులోని ఓ ఇంటిలో గుట్టుగా జరుగుతున్న వ్యభిచార గృహంపై పోలీసులు శనివారం రాత్రి దాడి చేసి నిర్వాహకురాలు లక్ష్మీతిరుపతమ్మ, కొల్లిపరకు చెందిన విటుడు, విజయవాడకు చెందిన ఒక యువతిని అదుపులోకి తీసుకుని పోలీసులు విచారిస్తున్నారు.

9 మంది జూదరులు అరెస్టు

కొల్లిపర, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని గ్రామాల్లో శనివారం జూదరులపై దాడులు నిర్వహించగా తూములూరు శివారు క్రిస్టియన్‌పాలెంలో తొమ్మిది మంది జూదరులను అరెస్టు చేసినట్లు ఎస్ఐ కోటేశ్వరరావు తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాలు ప్రకారం తూములూరు చివారు క్రిస్టియన్ పాలెంలో జూదం ఆడుతున్నట్లు సమాచారం రావటంతో వారిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నున్న రూ 11వేల 620ను, ఆరు సెల్ ఫోన్‌లను, ఒక ఆటో సీజ్ చేసి కేసునమోదు చేసినట్లు ఎస్ఐ తెలియజేశారు.

ఘనంగా ధన్వంతరి జయంతి మహోత్సవం



గ్రామీణ వైద్యులను సత్కరిస్తున్న బృందం సభ్యులు

తెనాలి అర్బన్, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి) : ధన్వంతరి జయంతి మహోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. షరాఫ్ బజారులోని పంచముఖ ఆంజనేయస్వామి ఆలయంలో విఖనస శ్రీనివాస ట్రస్ట్ సంకీర్తన బృందం ఆధ్వర్యంలో గ్రామీణ వైద్యులు అద్దేపల్లి శ్రీమన్నారాయణ, నారాయణం వేణుగోపాల్, బండారు రవికాంత్‌లను సత్కరించారు. వంశపారంపర్య అర్చకులు శ్రీనివాసమూర్తి మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాల్లో రోగులకు అందుబాటులో ఉండి వైద్యసేవలు అందిస్తున్న గ్రామీణ వైద్యులు అభినందనీయులన్నారు. ఈవో హరిప్రసాద్, కిరణ్‌కుమార్, అనురాధ, రామారావు, వెంకటేష్ పాల్గొన్నారు.

● పెదకాకాని, అక్టోబర్ 18(ఆంధ్రజ్యోతి): ధన్వంతరి జయంతి వేడుకలు పెదకాకాని గ్రామ నాయి బ్రాహ్మణ సేవా సంఘం, పెదకాకాని శ్రీగంగ భ్రమరాంబ మల్లేశ్వరస్వామి దేవస్థాన కల్యాణకట్ట సభ్యుల ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలో భాగంగా సంఘీయులైన వైద్యులకు సత్కరించారు. ఈ సందర్భంగా హోమియోపతి వైద్యులు హరిబాబు మాట్లాడుతూ ధన్వంతరి గురించి, వైద్యం గురించి వివరించారు. కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ పొన్నూరు నియోజకవర్గం కన్వీనర్ కొమ్మూరి మల్లికార్జునరావు, జిల్లా నాదస్వర కమిటీ కన్వీనర్ మున్నంగి బాజీరావు, ల్యాబ్ టెక్నీషియన్ రాంబాబు, నాదస్వర కమిటీ మున్నంగి శివ, కాకాని సుబ్బారావు, మాజీ సొసైటీ అధ్యక్షుడు ముక్కెర రాజు, నాయీ బ్రాహ్మణ సంఘ నాయకులు సదాశివరావు, రాజశేఖర్, వెంకట్రావు, శంకర్రావు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు దుస్తులు పంపిణీ



దుస్తులు పంపిణీ చేస్తున్న స్వరూపరాణి

తెనాలి క్రైం, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): కొలకలూరు గ్రామ పంచాయితీలో పారిశుధ్య కార్మికులకు నసీమా చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శనివారం వస్త్రాల పంపిణీ జరిగింది. డివిజన్ పంచాయితీ అధికారి స్వరూపరాణి, డిప్యూటీ ఎండీవో వైవీడి ప్రసాద్ పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. బీజేపీ ఆర్టీఐ సెల్ జిల్లా కన్వీనర్ కలిశెట్టి రమేష్ బాబు సతీమణి స్వర్గీయ నసీమా వర్ధంతికి ఇలాంటి స్వచ్ఛంద కార్యక్రమాలు చేపట్టడం సంతోషంగా ఉందని డీపీవో స్వరూపరాణి తెలిపారు. కార్యక్రమంలో హరీష్ నాయుడు, బండి చంద్రమోహన్, ధూళ్ల శ్రీనివాసరావు, ఎస్.సాయి, వీరరాఘవయ్య తదితరులు పాల్గొన్నారు.

జీఎస్టీ తగ్గింపుపై విద్యుత్ ఉద్యోగులకు అవగాహన

తెనాలి అర్బన్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన జిఎస్‌టి తగ్గింపుపై విద్యుత్ ఉద్యోగులకు శనివారం అవగాహన కల్పించారు. చెంచుపేటలోని డివిజన్ విద్యుత్ కార్యాలయంలో ఈఈ అక్కల సత్యనారాయణ మాట్లాడుతూ, పలు వస్తువులపై పన్ను తగ్గింపు కారణంగా సామాన్యులు సైతం గతంలో కొనలేని వస్తువులకు వెసులుబాటు లభించిందన్నారు. పండుగ సమయాల్లో జిఎస్‌టి తగ్గింపు కారణంగా పలు దుకాణాలు రద్దీగా ఉన్నాయని, ఎంతో మంది ఈ సౌకర్యాన్ని వినియోగించుకున్నారని చెప్పారు. వివిధ రకాల వస్తువులపై తగ్గిన జిఎస్‌టి వివరాల కరపత్రాలను ఉద్యోగులకు పంపిణీ చేశారు. రెవెన్యూ ఏవో కృష్ణారెడ్డి, ఏడీఈ అశోక్‌కుమార్, ఏఈలు పాల్గొన్నారు.



ప్రచారంలో పాల్గొన్న విద్యుత్ ఉద్యోగులు

బ్యాంకు లింకేజీ ద్వారా అర్హులకు రుణాలు

డీఆర్‌డీఏ ఏపీఎం రమాదేవి



సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్‌డీఏ ఏపీఎం రమాదేవి

కొల్లిపర, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): బ్యాంకు లింకేజీ ద్వారా అర్హత ఉన్న వారికి రుణాలు మంజూరు చేయనున్నట్లు డీఆర్‌డీఏ ఏపీఎం రమాదేవి అన్నారు. శనివారం స్థానిక స్త్రీ శక్తి భవనంలో యానిమేటర్లకు, పొదుపు సంఘాల సభ్యులకు ఆమె సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. పొదుపు సంఘాల సభ్యులకు బ్యాంకు రుణాలపై తగిన సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ సందర్భంగా రమాదేవి మాట్లాడుతూ బ్యాంకు లింకేజీ ద్వారా రుణాలు తీసుకున్న వారు చిన్న, చిన్న వ్యాపారాలు చేసుకుని ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్నారు. డ్వాక్రా మహిళలు బ్యాంకు ద్వారా తీసుకున్న రుణాలను సక్రమంగా చెల్లించాలన్నారు. డ్వాక్రా మహిళలు పొదుపు ఎక్కువ చేసుకుంటే ఎక్కువ రుణాలు పొందటానికి వీలుకలుగుతుందన్నారు. డ్వాక్రాగ్రూపు సభ్యులు స్త్రీనిధిలో కూడా పొదుపు చేసుకోవాలన్నారు. పొదుపు సంఘాల సభ్యులు ప్రతి నెల సమావేశాన్ని ఏర్పాటు చేసుకోవాలన్నారు. సమావేశంలో సీసీలు విజయకుమార్, మధు, ఎమ్ఎస్ఏ సీతామహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బాలస్వామి పుట్టినరోజు వేడుకలు



అన్నదానం చేస్తున్న రామలింగాచారి

తెనాలి అర్బన్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : బుర్రిపాలెం రోడ్డులోని మహాత్మా గాంధీ సేవా శాంతి వృద్ధాశ్రమంలో, మన ఇల్లు ఆశ్రమం, నాజరుపేట లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో పెనుగొండ క్షేత్ర పీఠాధిపతి ప్రజ్ఞానంద సరస్వతి (బాలస్వామి) పుట్టినరోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. వృద్ధులకు అన్నదానం చేశారు. ఆశ్రమ నిర్వాహకులు వజ్రాల రామలింగాచారి మాట్లాడుతూ, స్వామీజీ పర్యవేక్షణలో పట్టణంలో లోక కళ్యాణం కోసం పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించినట్లు చెప్పారు. ముద్దాభక్తుని రమణయ్య, పెనుగొండ వెంకటేశ్వరరావు, మాణిక్యరావు, మురళీ, భారతి, ఛాందన, రావూరి సుబ్బారావు పాల్గొన్నారు.

అంబులెన్స్‌లో ఆడబిడ్డ ప్రసవం



108లో ప్రసవం చేసిన సిబ్బంది


చేబ్రోలు, అక్టోబరు 18 (ఆంధ్ర జ్యోతి): చే బ్రోలు మండలం వీరనాయకుని పాలెం గ్రామానికి చెందిన కొండూరు రాణి(24) ప్రసవ వేదనతో బాధపడుతుండటంతో 108 అంబులెన్స్‌లో తెనాలి ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా, మార్గమధ్యంలో గరువుపాలెం సమీపంలో డెలివరీ జరిగింది. 108 అంబులెన్స్ సిబ్బంది ఇఎంటి ఎం. శంకర్, పైలట్ వి. కిషోర్‌బాబు, ఆశా వర్కర్ టి. ఉషారాణి సమక్షంలో రాణి ఆడబిడ్డకు జన్మనిచ్చింది. తల్లి, బిడ్డ ఇద్దరూ సురక్షితంగా ఉన్నారని గుంటూరు జిల్లా 108 జిల్లా మేనేజర్ పి. బాలకృష్ణ తెలిపారు. ఈ సందర్భంగా కొండూరు రాణి కుటుంబ సభ్యులు 108 సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. రాణికి ఇది నాలుగో కాన్పు. గ్రామస్తులు అంబులెన్స్ సిబ్బంది చొరవను కొనియాడారు.



ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగిస్తున్న ఎన్ఎస్ఎస్ వలంటీర్లు

ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర

ఏఎన్‌యూ అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో జాతీయ సేవా దళం ఆధ్వర్యంలో శనివారం స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంజనీరింగ్ కళాశాల ఆవరణంలో ఉన్న ప్లాస్టిక్ వ్యర్థాలను, పిచ్చి ముక్కలను శుభ్రం చేశారు. అనంతరం ఎన్ ఎస్ ఎస్ విభాగ ఆచార్యులు దివ్య తేజోమూర్తి మాట్లాడుతూ ప్రతి నెల మూడో శనివారం వలంటీర్లు అందరూ స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో పాల్గొని వర్సిటీ శుభ్రతకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్ లింగరాజు, ప్రోగ్రామ్ ఆఫీసర్ రవికుమార్, ఉమాశంకర్ తదితరులు పాల్గొన్నారు.



బాలికలకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న తెలుగుదేశం పార్టీ నాయకులు

బాలికా విద్యకు ప్రభుత్వ ప్రోత్సాహం

పొన్నూరు, అక్టోబరు18(ఆంధ్రజ్యోతి): బాలికల విద్యాభివృద్ధికి ప్రభుత్వం సంపూర్ణ సహకారం అందిస్తుందని సంగం డెయిరీ పాలకవర్గ సభ్యులు, టీడీపీ పార్లమెంటు రైతు ప్రధాన కార్యదర్శి బొర్రు రామారావు అన్నారు. పట్టణంలోని బాలికల వసతి గృహంలో శనివారం దుప్పట్ల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా పసతి గృహం లోని బాలికలు అందరికీ దుప్పట్లను పంపిణీ చేశారు. అనంతరం తెలుగుదేశం పార్టీ నాయకులు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలలు వసతి గృహాల్లో అవసరమైన అన్ని సౌకర్యాలను అందిస్తుందని వివరించారు. విద్యతోనే ప్రగతి సాధ్యమని గుర్తించి ఉన్నత చదువులు చదవాలని ఆకాంక్షించారు. తల్లిదండ్రుల ఆకాంక్షలను అనుగుణంగా బాలికలు అన్ని రంగాల్లో రాణించాలని సూచించారు. గత ఏడాది వసతి గృహ విద్యార్థినులు నూరు శాతం ఉత్తీర్ణత సాధించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో హాస్టల్ వార్డెన్ వెంకటేశ్వరమ్మ, తెలుగుదేశం పార్టీ నాయకులు నిడుబ్రోలు టీడీపీ అధ్యక్షుడు జాగర్లమూడి సుధీర్, ఆరె వరప్రసాద్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు షేక్ బాజి సాహెబ్ పాల్గొన్నారు.